


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 128 | మంగళవారం 12 - 05 -2026 | పేజీలు : 12 | వెల-3


## గిల్, సాయి సుదర్శన్ మెరుపులు.. రాజస్థాన్ బౌలర్లు బేజారు





# అమరావతిలో 'పుంగోల్'

- సింగపూర్ తరహా టౌన్‌షిప్
- దేశానికే రోల్ మోడల్‌గా నిర్మాణం
- సింగపూర్ సహకారంతో అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి
- ఆగ్నేయ ఆసియా దేశాలతో సులభతర వాణిజ్యం
- అమరావతిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్లకు ఓకే
- విశాఖలో ప్రపంచ స్థాయి 'మైస్' సెంటర్
- గ్లోబల్ ఈవెంట్ల గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దుతాం
- ఏపీ-సింగపూర్ మధ్య పోర్టు ఆధారిత కారిడార్
- సింగపూర్‌లో జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీతో లోకేశ్ భేటీ.. సీఐసీ సీఈవోతో చర్చలు

రాజధాని అమరావతిలో సింగపూర్‌లోని ఆధునిక పుంగోల్ తరహా ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా దేశానికే ఓ రోల్ మోడల్ టౌన్‌షిప్‌గా నిలుస్తుందని చెప్పారు. సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం అక్కడి వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోని జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ (జేఐఎస్సీ) సమావేశంలో పాల్గొన్నారు.

# సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారు:

- సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్‌ల కృషి వల్లే ఆలయం పూర్తయిందని వెల్లడి
- బుజ్జగింపు రాజకీయాలు చేసే శక్తులు దేశంలో ఇప్పటికీ ఉన్నాయని విమర్శ
- రామాలయ నిర్మాణాన్ని కూడా కొందరు వ్యతిరేకించారని గుర్తు చేసిన మోదీ
- అభివృద్ధి, వారసత్వం రెండూ తమ ప్రభుత్వ అజెండా అని స్పష్టీకరణ

ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై తీవ్ర విమర్శలు చేశారు. స్వాతంత్ర్యానంతరం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారని ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాల కోసం జాతీయ ఆత్మగౌరవాన్ని పక్కనపెట్టే శక్తులు దేశంలో ఇప్పటికీ ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.



## తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియామకం



- ఆరుగురు సభ్యులను కూడా నియమించిన ప్రభుత్వం
- సభ్యుల్లో కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత తదితరులు
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితులయ్యారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, ఆరుగులు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవ రెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరాలను నియమించారు. వీరి పదవీకాలం ఐదేళ్ల పాటు ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# బంగారం కొనొద్దన్న మోదీ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ ఘాటు స్పందన



- ప్రజలు త్యాగాలు చేయాలన్న ప్రధాని మోదీ విజ్ఞప్తి
- ఇది వైఫల్యానికి నిదర్శనమంటూ రాహుల్ గాంధీ విమర్శ
- ఏడాది పాటు బంగారం కొనొద్దని, ఇంటి నుంచే పనిచేయాలని సూచించిన మోదీ
- ప్రతిసారీ బాధ్యతను ప్రజలపై నెట్టేస్తున్నారన్న రాహుల్

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు త్యాగాలు చేయాలంటూ ప్రధాని చేసిన విజ్ఞప్తి 'వైఫల్యానికి నిదర్శనం' అని ఆయన అభివర్ణించారు. సోమవారం నాడు ఎక్స్ వేదికగా రాహుల్ స్పందిస్తూ.. "నిన్న మోదీజీ ప్రజలను త్యాగాలు చేయమని అడిగారు. బంగారం కొనొద్దు, విదేశాలకు వెళ్లొద్దు, పెట్రోల్ వాడకం తగ్గించండి అన్నారు. ఇవి ఉపన్యాసాలు కాదు.. వైఫల్యానికి రుజువులు" అని పేర్కొన్నారు. "12 ఏళ్లలో ఆయన దేశాన్ని ఇంతటి స్థితికి తీసుకొచ్చారు. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసి, తాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక 'కాంప్రమైజ్డ్ ప్రధాని' దేశాన్ని నడిపించడం ఇక సాధ్యం కాదు" అని రాహుల్ తీవ్రంగా విమర్శించారు.ప్రధాని విజ్ఞప్తి ఇదే.. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఏడాది పాటు బంగారం కొనడం ఆపాలని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి, మెట్రో, కార్ పూలింగ్ వంటివి ఉపయోగించాలని సూచించారు. అలాగే, వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచే పని) విధానాన్ని మళ్లీ పాటించాలని, వంట నూనెలు, ఎరువుల వాడకం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానైనా విదేశీ మారకాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

## ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు.. తెలంగాణకు ఏం ఇచ్చారు?



- జనగణన ఫారమ్‌లలో లోపాలు ఉన్నాయన్న పొన్నం
- బీసీలను విస్మరించారని విమర్శ
- గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమని సవాల్



## బండి సంజయ్ కుమారుడిపై కేసు.. స్పందించిన తెలంగాణ బీజేపీ చీఫ్

- బండి భగీరథ్‌పై నమోదైన కేసుతో బీజేపీకి సంబంధం లేదని స్పష్టీకరణ
- ఈ విషయం బండి సంజయ్ కుటుంబంలో జరిగిందని వ్యాఖ్య
- బండి సంజయ్ కుటుంబ ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలన్న బీజేపీ చీఫ్

కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసుతో బీజేపీకి సంబంధం లేదని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన తెలిపారు. ఈ విషయం బండి సంజయ్ కుటుంబంలో జరిగిందని ఆయన తెలిపారు. బీజేపీ అంశం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో బండి సంజయ్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలని అన్నారు

**మోదీ పర్యటనకు అసాధారణ స్పందన** సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగసభకు అసాధారణ

## నెల రోజులపాటు టీఆర్ఎస్ జెండా పండుగ: కవిత




## చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్



## చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్

**తమిళనాడు సీఎం విజయ్, మాజీ సీఎం స్టాలిన్‌తో భేటీ**

**ఎమ్మెల్యేగా ప్రమాణం చేశాక స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం**

**విజయ్‌ను ఆలింగనం చేసుకుని శాలువాతో సత్కరించిన స్టాలిన్**

**ఈ సమావేశంలో ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్న వైనం**

తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ఆయన నేరుగా చెన్నైలోని స్టాలిన్ నివాసానికి వెళ్లారు. తన నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి విజయ్‌ను స్టాలిన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని, శాలువాతో సత్కరించారు. ఈ భేటీలో స్టాలిన్ కుమారుడు, మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎంల మద్దతుతోనే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చే విషయంలో తమ మిత్రపక్షాలకు స్టాలిన్ పూర్తి స్వేచ్ఛ కల్పించారు. ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు పరోక్షంగా సహకరించిన స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకే విజయ్ ఆయనను కలిసినట్లు తెలుస్తోంది. సీఎం బాధ్యతలు చేపట్టాక విజయ్, స్టాలిన్‌ను కలవడం ఇదే తొలిసారి. ఈ భేటీ తమిళ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించింది.

## భారత్ మార్గం ప్రత్యేకం..మనం అమెరికా-చైనా బాటలో వెళ్లడం లేదు: గౌతమ్ అదానీ

భారత్ ప్రయాణం అమెరికా లేదా చైనా మార్గంలో ఉండదని, మనం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కాకుండా.. సజీవంగా, ఎదుగుతున్న, డిమాండ్ ఉన్న భారతదేశం కోసం పునాదులు వేస్తున్నామని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. నేడు 'సీఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్ 2026'లో ఆయన ప్రసంగిస్తూ, భారత వృద్ధి పథంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. భారత వృద్ధి సాధారణమైనది కాదని, ఇది కాంపౌండింగ్ పద్ధతిలో వేగంగా దూసుకెళుతోందని అదానీ వివరించారు. "స్వాతంత్ర్యం తర్వాత 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి భారత్‌కు 67 ఏళ్లు పడితే, తర్వాతి 2 ట్రిలియన్ డాలర్లను కేవలం 12 ఏళ్లలోనే జోడించగలిగాం. ఈ వేగంతో వెళితే, ప్రతి దశాబ్దానికి భారత్ తన జీడీపీకి ఒక కొత్త యూరోపియన్ ఆర్థిక వ్యవస్థకు సమానమైన మొత్తాన్ని జోడిస్తుంది. ఇది లీనియర్ వృద్ధి కాదు, కాంపౌండింగ్ యాక్సిలరేషన్" అని ఆయన నొక్కి చెప్పారు. ఇంధన రంగంలో భారత్ అసాధారణ ప్రగతి సాధించిందని తెలిపారు. 2026 మార్చి నాటికి 500 గిగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని దాటామని, ఇందులో 53 శాతం గత పదేళ్లలోనే వచ్చిందని చెప్పారు. 2047 నాటికి దీన్ని 2000 గిగావాట్లకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. భవిష్యత్ టెక్నాలజీ అయిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై పాశ్చాత్య దేశాల భయాలను భారత్ దిగుమతి చేసుకోవద్దని అదానీ సూచించారు. "ఏఐ ఉద్యోగాలను తొలగిస్తుందనే వాదనను నేను పూర్తిగా తిరస్కరిస్తున్నాను. టెక్నాలజీ మానవ తీర్పును భర్తీ చేయదు. ఏఐ ఉత్పాదకతను పెంచి, కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది, చిన్న వ్యాపారాలను శక్తిమంతం చేస్తుంది" అని భరోసా ఇచ్చారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వైసీపీ మాజీ సర్పంచ్



**టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు**

**కూడేరు మండలంలో భూ దోపిడీ..**

**నోటీసులు లేకుండానే ఆన్‌లైన్ రికార్డుల తారుమారు**

**దూళంవారిపల్లిలో భూ మాఫియా దౌర్జన్యం.. న్యాయం చేయాలంటూ వినతి**

**అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు**

**మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ**

**మంగళగిరి, మే 11. నంది పత్రిక:** వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం క్రొత్తమాధవరం గ్రామానికి చెందిన నరసింహులు సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 40 సెంట్ల ప్రభుత్వ భూమిని (దీని విలువ సుమారు 2 కోట్ల రూపాయల పైమాటే) మాజీ వైసీపీ సర్పంచ్ అక్రమంగా ఆక్రమించుకోవడం జరిగింది. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు కానీ, పత్రాలు కానీ లేకుండానే ఈ స్థలంలో శాశ్వత కట్టడాలు నిర్మించి, వాటిని అద్దెలకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా, పక్కనే ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను కూడా అడ్డగోలుగా విక్రయిస్తున్నారు. సదరు ఆక్రమిత స్థలానికి సంబంధించి ఎటువంటి డాక్యుమెంట్లు లేవని ఎమ్మార్వో గారు, అలాగే ఆ కట్టడాలకు ఎటువంటి ఇంటి పన్నులు చెల్లించడం లేదని పంచాయతీ కార్యదర్శి గారు ఇప్పటికే లిఖితపూర్వకంగా ధృవీకరించారు. అధికారుల నుండి ఎటువంటి సహకారం అందకపోయినా, ఈ మాజీ సర్పంచ్ నకిలీ అనుబంధ సర్టిఫికేట్లు, ఫోర్జరీ సంతకాలతో కూడిన నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి, కోర్టు నుండి తాత్కాలిక స్టే తెచ్చుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన లక్ష్మీకాంతమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రి ఎం. ఎర్ర సుబ్బన్నకు 2007 సంవత్సరంలో ప్రభుత్వం సర్వే నంబర్ 495/3 లో 5 ఎకరాల డి-పట్టా భూమిని మంజూరు చేసింది. అయితే తన తండ్రి అనారోగ్యంతో 08/02/2025న మరణించిన తర్వాత తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే స్థానిక వీఆర్వో, ఎమ్మార్వోలు కుమ్మక్కై ఆ భూమిని ఆన్‌లైన్‌లో ఇతరుల పేరు మీద నమోదు చేశారు. తమ తెలియకుండానే మహమ్మద్ బాషా (05 సెంట్లు), పూజారి ప్రసాద్ (2.45 ఎకరాలు) పేర్లతో ఆన్‌లైన్ రికార్డులను మార్చారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, ఆర్డీవో కోర్టులో అప్పీల్ వేసినా ఫలితం లేకుండా పోయింది. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే, మళ్లీ ఏ. ప్రదీప్ కుమార్, ఇందిరాదేవి, మారుతీ ప్రసాద్, ఎం. వెంకటరమణ అనే వ్యక్తుల పేర్లపై మరో 2.50 ఎకరాల భూమిని ఆన్‌లైన్ నమోదు చేశారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం మజరా దూలంవారిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ తండ్రి (లేట్) సి. వెంకట్రాయప్ప పేరుతో 1989లో ప్రభుత్వం సర్వే నంబరు 41-4 నందు 1.58 ఎకరాల వ్యవసాయ భూమిని (పట్టా నంబరు: ఇా.వీ.చీశీ. 923/4/1989) మంజూరు చేసింది. గత 30 ఏళ్లుగా ఈ భూమిపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నాం. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారుల సహకారంతో రికార్డులను తారుమారు చేసి, తమ భూమిని దూళంవారిపల్లికి చెందిన కడపల ఆనంద రెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. ఆనంద రెడ్డి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలవంతుడు కావడంతో, తమ భూమిని తాము కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన మయబ్రహ్మచారి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం. 601.3 నందు 1.80 ఎకరాలు, సర్వేనెం. 601.4 నందు 1.90 ఎకరాల మెట్ట భూమి తమ తల్లిదండ్రులైన లేటు క్రిష్టపాటి అన్నపూర్ణమ్మ, చంద్రశేఖరాచారి గారి పేరు మీద ఉంది. ఈ భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లోనూ, 'మీ భూమి' ఆన్‌లైన్ పోర్టల్‌లోనూ డిజిటల్ పట్టా పాసుబుక్కుల్లోనూ స్పష్టంగా తమ తల్లి అన్నపూర్ణమ్మ గారి పేరు (ఖాతా నెం. 1799) మీద నమోదు చేయబడి ఉంది. జీవనోపాధి నిమిత్తం గుంటూరులో నివసిస్తుండటాన్ని అదునుగా తీసుకున్న బొరిగొర్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈ భూమిని ఆక్రమించుకున్నాడు. అంతేకాకుండా స్థానిక రెవెన్యూ అధికారులను, రాజకీయ నాయకులను లోబరుచుకుని తన పేరు మీద అక్రమంగా నమోదు చేయించుకున్నాడు. అన్యాయంగా భూమిని ఎందుకు ఆక్రమించావని ప్రశ్నించినందుకు, "నీకు దిక్కున్న చోట చెప్పుకో, చేనులోకి అడుగుపెడితే నీ అంతు చూస్తా" అని సదరు వ్యక్తి ప్రాణహాని తలపెట్టేలా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం మజరా దూలంవారిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ తండ్రి (లేట్) సి. వెంకట్రాయప్ప పేరుతో 1989లో ప్రభుత్వం సర్వే నంబరు 41-4 నందు 1.58 ఎకరాల వ్యవసాయ భూమిని (పట్టా నంబరు: ఇా.వీ.చీశీ. 923/4/1989) మంజూరు చేసింది. గత 30 ఏళ్లుగా ఈ భూమిపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నాం. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారుల సహకారంతో రికార్డులను తారుమారు చేసి, తమ భూమిని దూళంవారిపల్లికి చెందిన కడపల ఆనంద రెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. ఆనంద రెడ్డి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలవంతుడు కావడంతో, తమ భూమిని తాము కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం రేగాటిపల్లి గ్రామానికి చెందిన పెద్దన్న గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో 1997 నుంచి సాగు చేసుకుంటున్న భూమిని కొంతమంది స్థానిక బలవంతులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. తన అనుమతి లేకుండానే ఆ భూమిని ఇతరులకు కౌలుకు ఇస్తూ తమకు అన్యాయం చేస్తున్నారు. తమ భూమిని తమకు ఇప్పించాలని కోరుతూ గతంలో పలుమార్లు తహశీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పించాం. అయితే క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇప్పటికీ ఆ భూమి ఆక్రమణదారుల గుప్పిట్లోనే ఉంది. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. అనంతపురం జిల్లా గుమ్మగట్ట గ్రామానికి చెందిన భైరవానితిప్పకు చెందిన హనుమక్క గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెంబర్ 392లో 0.02 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించి, 28/12/2022న తన పేరు మీద పట్టా ఇచ్చారు. ఆ స్థలంలో ఇల్లు కట్టుకోవాలని లక్ష రూపాయలు అప్పు చేసి మరీ బేస్మెంట్ (పునాది) కట్టుకున్నాను. కానీ తాము గ్రామంలో లేని సమయం చూసి కొందరు దుండగులు అన్యాయంగా తన ఇంటి పునాదులను పికివేశారు. దీనిపై స్థానిక తహశీల్దార్ గారికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దాంతో న్యాయం కోసం రాయదుర్గం సివిల్ కోర్టును ఆశ్రయించాను. కోర్టు వారు తన వైపు న్యాయం ఉందని గుర్తించి, తనకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చారు. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ, స్థానిక వీఆర్వో రమేష్, ఆర్ఐ రామాంజనేయులు, సర్వేయర్ గారు కలిసి తనను తీవ్రంగా వేధిస్తున్నారు. జిల్లా కలెక్టర్ గారికి నేను ఫిర్యాదు చేసినా, "మీరు కలెక్టర్ దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేస్తారా?" అంటూ ఈ ముగ్గురు అధికారులు నన్ను ఇష్టమొచ్చినట్లు తిడుతూ, మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు. కోర్టు ఉత్తర్వులను సైతం గౌరవించకుండా, పేద మహిళనైన తనకు ఇల్లు కట్టుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బంగారుచెన్నేపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. అనంతపురం టౌన్ రామ్ నగర్ నివాసి అయిన మాధవరెడ్డి, అతని కుమారుడు విజయ్ మోహన్ రెడ్డిలు, తన నుండి భూమి కొనుగోలు నిమిత్తం ఒప్పందం చేసుకున్నారు. ఇందుకు ప్రతిఫలంగా రూ. 10,00,000/- విలువైన చెక్కులను అందజేశారు. అయితే ఆ చెక్కులను బ్యాంకులో జమ చేయగా అవి చెల్లలేదు. తన డబ్బు గురించి సదరు వ్యక్తులను నిలదీయగా, వారు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అటాక్ చేయడానికి ప్రయత్నించారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో కొత్త వ్యక్తులతో కలిసి తనను చంపే ఉద్దేశంతో దాడికి పాల్పడ్డారు. అక్కడ ప్రజలు గుమిగూడటంతో ప్రాణాలతో బయటపడ్డాను. ముఖ్య నిందితుడు మాధవరెడ్డిపై ఇప్పటికే అనంతపురం 2-టౌన్ పోలీస్ స్టేషన్‌లో పలు క్రిమినల్ కేసులు, ఇతర అక్రమ కేసులు నమోదై ఉన్నాయి. గతంలో రెడ్డిపల్లి సబ్ జైలుకు కూడా వెళ్ళి వచ్చిన ఈ వ్యక్తి, రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని తనపై నమోదైన పాత కేసులను రద్దు చేసుకున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. అన్నమయ్య జిల్లా నందలూరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన శ్యామలమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ మామగారైన అవసాని యద్దయ్య గారికి ముగ్గురు కుమారులు (నారాయణ, రామచంద్రయ్య, నరసింహులు). పెద్ద కుమారుడైన తమ బావగారు అవసాని నారాయణ గారు 05.12.2009న మరణించారు. ఆయన భార్య కూడా ముందే మరణించారు. వారికి సంతానం లేదు. వారసత్వంగా ఆ భూమి తమకు చెందాలి. తమ బావగారికి టంగుటూరు రెవెన్యూ గ్రామ సర్వే నెం: 1112/3 లో 2 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలను పుల్లంపేటకు చెందిన వైసీపీ నాయకులు బండి మారుబాబు, రెవూరు రామచంద్ర కలిసి దొంగతనంగా తీసుకువెళ్లారు. రాజకీయ పలుకుబడి, డబ్బు బలంతో నందలూరు మండల తహశీల్దారు, గ్రామ కార్యదర్శిని లోబరుచుకుని, తమకు ఎలాంటి సంబంధం లేని బండి హరిబాబు పేరు మీద ఆ భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు. తమ బావగారి మరణ సర్టిఫికేట్ కోసం తాము ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా జిల్లా అధికారుల ఆదేశాలు ఉన్నా కూడా మండల అధికారులు మంజూరు చేయడం లేదు. భూమి రికార్డులు మార్చవద్దని కోరినా రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు తమ మాట వినడం లేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిన్నగుడి గ్రామానికి చెందిన రామాంజనేయులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..బోడగాని దాకి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 44/2లో సుమారు 3 ఎకరాల 83 సెంట్ల భూమిని ప్రభుత్వం 1950వ సంవత్సరంలోనే తమ బంధువు అయిన ఆసాది ఓబులేసు అనే వ్యక్తికి 'డి-పట్టా' కింద మంజూరు చేసింది. గత 76 ఏళ్లుగా ఆ కుటుంబం ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. అయితే ఓబులేసు మరణించాక, ఆర్థిక ఇబ్బందుల వల్ల తమ కుటుంబ సభ్యులు పనుల కోసం అనంతపురం పట్టణానికి వలస వెళ్లాం. తాము గ్రామంలో లేని సమయాన్ని అదునుగా తీసుకున్న చిన్న సుబ్బరాయుడు, వి. వెంకటేషులు, టి. బీజన్యం రసూల్ సాబ్, అల్లీ పీరా అనే నలుగురు వ్యక్తులు.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆ 'డి-పట్టా' భూమిని చెరో 96 సెంట్ల చొప్పున అక్రమంగా రికార్డుల్లోకి ఎక్కించుకుని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.



## సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారు:

సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్'లో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "1951లో సోమనాథ్ ఆలయ పునఃప్రతిష్ఠ కేవలం ఒక సాధారణ విషయం కాదు. అది భారతదేశ స్వతంత్ర నాగరిక స్పృహకు ప్రతీక" అని అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆలయ పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌ల సేవలను ప్రధాని కొనియాడారు. "500కు పైగా సంస్థానాలను ఏకం చేసి ఆధునిక భారతాన్ని నిర్మించిన సర్దార్ పటేల్, సోమనాథ్ పునర్నిర్మాణం ద్వారా మన ప్రాచీన వైభవాన్ని తిరిగి పొందుతున్నామన్న సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చారు" అని మోదీ వివరించారు.అయితే, ఈ మహత్కార్యానికి నెహ్రూ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైందని మోదీ ఆరోపించారు. "ఆలయ పునర్నిర్మాణం కోసం సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్ ఎంతో కృషి చేశారు. కానీ, వారికి నెహ్రూ జీ నుంచి ఎంత వ్యతిరేకత వచ్చిందో మనందరికీ తెలుసు. ఈ రోజు నేను ఆ వివరాల్లోకి వెళ్లడం లేదు. కానీ, సర్దార్ పటేల్ సంకల్పం ముందు ఏదీ నిలవలేదు. శతాబ్దాల అవమానాన్ని చెరిపేస్తూ సోమనాథ్ ఆలయం పునర్నిర్మితమైంది" అని మోదీ పేర్కొన్నారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని ప్రస్తుత రాజకీయాలతో ముడిపెడుతూ.. "జాతీయ ఆత్మగౌరవం కంటే బుజ్జగింపు రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చే శక్తులు ఇప్పటికీ ఉన్నాయి. అయోధ్యలో రామమందిర నిర్మాణం సమయంలోనూ ఇదే తరహా వ్యతిరేకత చూశాం. మనం ఇలాంటి సంకుచిత రాజకీయాలను దాటి ముందుకు సాగాలి. అభివృద్ధి, వారసత్వం రెండింటినీ కలిపి ముందుకు తీసుకెళ్లాలి" అని అన్నారు. గత పదేళ్లలో కాశీ విశ్వనాథ్ ధామ్, ఉజ్జయిని మహాకాల్ మహలోక్, కేదార్‌నాథ్ పునర్నిర్మాణం వంటి ప్రాజెక్టుల ద్వారా దేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ తెలిపారు. ఈ వేడుకలు కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం కోసం కాదని, రాబోయే వెయ్యేళ్లకు దేశానికి స్ఫూర్తినిచ్చే పండుగ అని ఆయన అభివర్ణించారు. అంతకుముందు ప్రధాని ఆలయంలో జరిగిన కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియామకం

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్రంలోని మహిళల హక్కులను పరిరక్షించడానికి, వారిపై జరుగుతున్న అన్యాయాలు, వేధింపులను అరికట్టడానికి ఏర్పాటు చేయబడిన చట్టబద్ధమైన సంస్థ. ఇది మహిళలకు న్యాయం చేకూర్చడం, సంక్షేమం మరియు సాధికారత కోసం పనిచేస్తుంది.

## ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు.. తెలంగాణకు ఏం ఇచ్చారు?:

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన, హౌస్ హోల్డ్ సర్వే ఫారమ్‌లలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వే ఫారమ్‌లో కేవలం ఎస్సీ, ఎస్టీ అనే ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని, మెజారిటీ జనాభా కలిగిన బీసీల ప్రస్తావనే లేకపోవడం వారిని విస్మరించడమేనని మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి కులగణన అత్యవసరమని, కేంద్రం ఈ విషయంలో వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షపై స్పందించాలని రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి సవాల్ విసిరారు. గత 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులపై సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద లేదా మరెక్కడైనా సరే బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్న కేంద్రం, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ, "రాష్ట్రానికి ఏం ప్రాజెక్టులు ఇస్తారో చెప్పకుండా, బంగారం కొనొద్దు అని సలహాలు ఇవ్వడానికే మోదీ వచ్చారా?" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా నిధుల విడుదలపై స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడిని తాము కూడా పూజిస్తామని, అయితే బీజేపీలాగా ఓట్ల కోసం దేవుడిని వాడుకోమని స్పష్టం చేశారు.

## నెల రోజులపాటు టీఆర్ఎస్ జెండా పండుగ: కవిత

తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ నెల 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా 'జెండా పండుగ' నిర్వహించాలని పార్టీ శ్రేణులకు అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధానితోపాటు జిల్లా కేంద్రాలు, మండల, గ్రామస్థాయి వరకు ప్రతివార్డులో జెండాలు ఎగుర వేసి, పార్టీ ప్రకటించిన పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ మళ్లీ వంచనకు గురవుతోందని, వలస పాలన నాటి దుష్పరిణామాలను మళ్లీ ఎదుర్కొంటున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ పునర్నిర్మాణం కోసం తెలంగాణ రక్షణ సేన బాధ్యత తీసుకొని ఉద్యమిస్తుందని తెలిపారు. స్వరాష్ట్ర సాధనకు అవిశ్రాంతంగా ఉద్యమించిన మనమంతా కూడా ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణం, సబ్బండ వర్గాల వికాసం కోసం మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. అందులో భాగంగానే తెలంగాణ రక్షణ సేన జెండాను ప్రతి వాడకు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

### బండి సంజయ్ కుమారుడిపై కేసు.. స్పందించిన తెలంగాణ బీజేపీ చీఫ్

స్పందన వచ్చిందని రామచందర్ రావు అన్నారు. మోదీ పర్యటనతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో స్పష్టమైన ప్రకంపనలు వచ్చాయని అన్నారు. ఈ సభ విజయవంతం కావడానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని అన్నారు. వైద్యులు, నర్సులు, న్యాయవాదులు, యువత, మహిళలు, వివిధ రంగాల నిపుణులు, హైదరాబాద్ నలుమూలల నుంచి బీజేపీ కార్యకర్తలతో కలిసి ఈ సభలో అపారమైన ఉత్సాహంతో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన అశేష జనసమూహం, అక్కడ వెల్లివిరిసిన ఉత్సాహం, మోదీ నాయకత్వంపై, అలాగే 'వికసిత తెలంగాణ – వికసిత భారతదేశం' అనే దార్శనికతపై ప్రజలలో పెరుగుతున్న అచంచలమైన విశ్వాసానికి సజీవ నిదర్శనంగా నిలిచిందని రామచందర్ రావు అన్నారు.

## అమరావతిలో 'పుంగోల్'

రాజధాని అమరావతిలో సింగపూర్‌లోని ఆధునిక పుంగోల్ తరహా ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా దేశానికే ఓ రోల్ మోడల్ టౌన్‌షిప్‌గా నిలుస్తుందని చెప్పారు. సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం అక్కడి వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోని జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ (జేఐఎస్సీ) సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు సహాయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమీకృత టౌన్‌షిప్ విధివిధానాల్లో వేగాన్ని పెంచాలని జాయింట్ ఇంప్లిమెంటేషన్ వర్కింగ్ కమిటీ (జేఐడబ్ల్యూసీ)ని కోరారు. సింగపూర్ సహకారంతో అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని చెప్పారు. దీని అభివృద్ధికి ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. అమరావతి రాజధానికి ఇప్పుడు చట్టబద్ధత ఉందని, ఇది అమరావతిలో పెట్టుబడులకు మదుపరులలో విశ్వాసాన్ని పెంచుతుందని వివరించారు. రాష్ట్రం నుంచి సింగపూర్ ద్వారా ఆగ్నేయాసియా, తూర్పు ఆసియా మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కోరారు. సింగపూర్ సన్‌టెక్ సిటీ తరహాలో ఆంధ్రప్రదేశ్‌ను కూడా మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్ అండ్ ఎగ్జిబిషన్ (మైస్) గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉన్నామన్నారు. రాష్ట్రంలో రియల్‌టైమ్ గవర్నెన్స్‌ను బలోపేతం చేయడానికి సింగపూర్ అనుభవాన్ని ఉపయోగించుకుంటామని చెప్పారు.

**సింగపూర్–ఏపీ మధ్య పటిష్ఠ భాగస్వామ్యం** సింగపూర్– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఇప్పుడు పటిష్ఠమైన భాగస్వామ్యం నెలకొందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. భాగస్వామ్య ఒప్పందాల్లోని అంశాల అమలుపై వర్కింగ్ గ్రూపుల ద్వారా ప్రతినెలా సంప్రదింపులు జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు ఆరుగురు రెండు వారాల క్రితం సింగపూర్–ఏపీ గవర్నెన్స్ ఎక్సలెన్స్ (ఎస్ఏజీఈ) కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు శిక్షణా తరగతులకు హాజరై పరిపాలనలో తమ అనుభవాలను పంచుకున్నారని వెల్లడించారు.

నంది పత్రిక
మంగళవారం 12 - 05 -2026

# 6 కోట్ల రూపాయల ఖర్చుతో రైతు బజార్ విస్తరణకు భూమి పూజ



**150 మంది రైతులకు లబ్ధి**
**కర్నూలు స్మార్ట్ సిటీగా మార్చడానికి నిరంతర కృషి**
**పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త**
**కర్నూలు అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం**
**కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తి పాటి నాగరాజు**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**కర్నూలు ను స్మార్ట్ సిటీగా మార్చడానికి నిరంతర కృషి చేస్తున్నామని రైతు బజార్ విస్తరణ భూమి పూజ సందర్భంగా పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త పేర్కొన్నారు. సోమవారం ఉదయం కర్నూలు పట్టణ సి - క్యాంపు రైతు బజార్ వెనుక పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త , కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు తో కలిసి రైతు బజార్ విస్తరణ కొరకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కర్నూలు ను స్మార్ట్ సిటీగా మార్చడానికి అన్ని చర్యలు తీసుకుంటూ ఉన్నామని , అందులో భాగంగా సి - క్యాంపులో ఇప్పుడు ఉన్న రైతు బజార్ ను 150 మంది రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా ఆరు కోట్ల రూపాయలతో విస్తరణ కార్యక్రమం మొదలు పెట్టామని తెలిపారు. ఇందులో రైతులకు అవసరమైన నీరు స్ప్రింక్లింగ్ సిస్టం , డ్రిప్ సిస్టం , పార్కింగ్ సౌకర్యం మరియు రెండు ఫ్లోర్ లతో రైతు బజార్ నిర్మాణం చేయడం జరుగుతుందని , ఈ నిర్మాణ పనులు 9 నెలల లోపు పూర్తి అయ్యేలాగా కాంట్రాక్టర్ ను ఆదేశించడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రైతు బజార్ ను సందర్శించారని తెలిపారు. 1999 లో తను ఏర్పాటు చేసిన , తనకి ఇష్టమైన రైతు బజార్ ను సందర్శించిన సందర్భంగా రైతులతో మాట్లాడిన తరువాత దీని విస్తరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆ హామీ ఇప్పుడు నెరవేర్చడం జరుగుతుంది మంత్రి తెలిపారు. రైతు బజార్ నిర్మాణం పూర్తి చేసిన వెంటనే ముఖ్యమంత్రి డ్రీమ్ ప్రాజెక్ట్ , పేద ప్రజలకు అత్యంత అవసరమైన మరియు కేవలం 15 రూపాయలకే మూడు పూటల కడుపునిండా భోజనం పెట్టె అన్న క్యాంటీన్ ను కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి తెలియజేశారు. అలాగే కర్నూలు బి - క్యాంపులో హైకోర్టు బెంచ్ మరియు అదునాతనమైన కలెక్టర్ కార్యాలయాన్ని నిర్మించే చర్యలు కూడా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను తెలిపారు. ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ...మంత్రి టి.జి.భరత్ ఆధ్వర్యంలో కర్నూలు లో ప్రతి వారము ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతూ ఉందని అందులో భాగంగా ఈ రోజు 6 కోట్ల రూపాయలతో రైతు బజారు విస్తరణ కార్యక్రమం కొరకు భూమి పూజ నిర్వహించడం జరిగిందని తెలిపారు. బి - క్యాంప్ లో హైకోర్టు బెంచ్ మరియు నూతన కలెక్టరేట్ నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు. కర్నూలుకు ఉన్న సమస్యలు కర్నూలు మెడికల్ కాలేజ్ రోడ్డు విస్తరణ , స్పోర్ట్స్ హాస్టల్ తిరుపతికి వెళ్లకుండా ఇక్కడే ఉంచటం మరియు రైతు బజార్ దగ్గర ట్రాఫిక్ సమస్య పరిష్కరించి రైతు బజార్ విస్తరణ చేయటం మొదలగునవని చేశాం అని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి టి. జి. భరత్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నవని పార్లమెంటు సభ్యులు తెలిపారు . ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు , మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ మూర్తి , కర్నూలు మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి , మార్కెట్ యార్డ్ చైర్మన్ గోల్కొండ అజమత్ బీ , వైస్ చైర్మన్ శేషగిరి , ఇంజనీర్ రఘురామ రెడ్డి , స్థానిక నాయకులు స్వామి రెడ్డి , గున్నా మార్క్ , రైతు బజార్ ఎస్టేట్ అధికారి మొదలగువారు పాల్గొన్నారు.



# క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం



**కర్నూలు స్టేడియాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నాం**
**స్పోర్ట్స్ హాస్టల్‌ను కర్నూలులోనే కొనసాగిస్తాం యువత ప్రతిరోజూ వ్యాయామం, క్రీడల్లో పాల్గొనాలి**
**రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ మరియు పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు టీజీ భరత్ గుప్తా**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని, కర్నూలు స్టేడియాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ మరియు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా పేర్కొన్నారు.సోమవారం కర్నూలు నగరంలోని సమ్మర్ కోచింగ్ క్యాంపును రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా, కర్నూలు ఎంపీ బస్తీపాటి నాగరాజు, శాప్ చైర్మన్ రవి నాయుడు కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా క్యాంపులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో మంత్రి ముచ్చటించి వారి ప్రతిభను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూడ యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచుకోవాలంటే ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేసే వారు శారీరకంగా, మానసికంగా మరింత ఉత్సాహంగా ఉండి తమ పనులను పదిరెట్లు ఎక్కువ సామర్థ్యంతో నిర్వహించగలరని పేర్కొన్నారు. టీజీవీ గ్రూప్ తరఫున దశాబ్దాలుగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వస్తున్నామని, ప్రతిభ ఉన్న యువతకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కర్నూలు జిల్లాలో క్రీడలకు అనుకూలమైన వాతావరణం ఉందని, ఇక్కడి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని అన్నారు. కర్నూలు స్పోర్ట్స్ హాస్టల్‌ను ఎక్కడికీ తరలించే ఆలోచన లేదని స్పష్టం చేసిన మంత్రి, హాస్టల్‌ను మరింత మెరుగైన సౌకర్యాలతో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే కర్నూలు స్టేడియంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో క్రీడా సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునేలా నగరంలోని పార్కులను వ్యాయామానికి అనుకూలంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. యువత క్రీడలను కెరీర్‌గా కూడా తీసుకోవాలని, ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతుందని హామీ ఇచ్చారు.

క్రీడారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎంపీ బస్తిపాటి నాగరాజు ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూడ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాలను సందర్శించినప్పటికీ, కర్నూలు జిల్లాలో ఉన్న స్థాయి క్రీడా వసతులు మరెక్కడా కనిపించలేదని శాప్ చైర్మన్ రవి నాయుడు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు తాను, మంత్రివర్యులు కలిసి స్టేడియంను పరిశీలించిన సమయంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి హామీ ఇచ్చామని తెలిపారు. ఆ హామీ మేరకు ప్రస్తుతం స్టేడియంలో అత్యాధునిక సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కావడం మంత్రి వారి ప్రత్యేక చొరవ, కృషి ఫలితమేనని కొనియాడారు. క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారంగా స్టేడియం నిర్వహణ మరియు మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఎంపీ నిధుల నుంచి రూ.15 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, యువత ప్రతిభను వెలికితీసే దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్‌కు విద్యార్థులు, యువత నుంచి విశేష స్పందన రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలిగించడంతో పాటు క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే విద్యా రంగంలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కర్నూలు స్టేడియాన్ని మరింత ఆధునికంగా అభివృద్ధి చేసే దిశగా విస్తృత స్థాయిలో చర్చలు కొనసాగుతున్నాయని, ఎంపీ స్పష్టం చేశారు.సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకుని జాతీయఅంతర్జాతీయ స్థాయిలో రాణించాలి.యువత ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదగడానికి క్రీడలే ఉత్తమ మార్గం : శాప్ చైర్మన్ రవి నాయుడు ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపులు యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకుని అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ యువత క్రీడల వైపు రావాలని, కనీసం వాకింగ్, యోగా వంటి శారీరక వ్యాయామాలలోనైనా పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరినీ గ్రౌండ్ వైపు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. గతంతో పోలిస్తే ఈసారి సమ్మర్ క్యాంపులను మరింత విభిన్నంగా నిర్వహిస్తున్నామని, ప్రతి క్యాంపుకు రూ.10 వేల చొప్పున నిధులు, క్రీడాకారులకు చిక్కీ, డైట్ సదుపాయాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో పాటు దాతలు కూడా ముందుకు వచ్చి పిల్లల పోషకాహార అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇప్పటికే పలువురు దాతలు ముందుకు రావడం ఆనందకరమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శాప్ ఆధ్వర్యంలో 50 సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, కర్నూల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 25 క్రీడా శిబిరాలు నగరవ్యాప్తంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కర్నూలు జిల్లా నుంచి కూడా పెద్ద ఎత్తున యువత పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. మంత్రివర్యులు టీజీ భరత్ గుప్తా ఆరోగ్యంగా, యవ్వనంగా ఉండటం యువతకు ఆదర్శమని పేర్కొంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమ చుట్టూ ఉన్న వారికీ స్పోర్ట్స్ క్యాంపుల గురించి తెలియజేసి మరింత మందిని క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. సమ్మర్ క్యాంపులు పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. తొలిసారిగా విద్యాశాఖ, యువజన సేవలు, స్పోర్ట్స్ అథారిటీ కలిసి ఒకే వేదికపై సమ్మర్ క్యాంపులను నిర్వహించడం విశేషమన్నారు. నేటి యువత చిన్న చిన్న విషయాలకే నిరుత్సాహానికి గురవుతున్న తరుణంలో, గెలుపోటములను సమానంగా స్వీకరించే మనోధైర్యం కేవలం క్రీడాకారులకే ఉంటుందని తెలిపారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఎంతో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని శాప్ చైర్మన్ రవి నాయుడు సూచించారు.అనంతరం సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొంటున్న క్రీడాకారుల మెరుగైన శిక్షణ కోసం అవసరమైన క్రీడా పరికరాలను మంత్రి, ఎంపీ, శాప్ చైర్మన్‌లు క్యాంప్ ఇన్‌చార్జిలకు అందజేశారు. క్రీడాకారుల ప్రతిభను మరింత ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శాప్ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ భరణి, సెక్కుర్ సీఈవో డాక్టర్ వేణుగోపాల్, డి. ఎస్ . డి.వో భూపతి రావు, సాయి స్పోర్ట్స్ హాస్టల్ ఇంచార్జి కార్తికేయన్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ, క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కెమిస్టుల జీవనాధారం ప్రజారోగ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్త బంద్ కు పిలుపు

**నంద్యాల ప్రతినిధి. మే 11 . (నంది పత్రిక ):**ఏఐఓసిడి దేశవ్యాప్తంగా ఉన్న 12.40 లక్షలకుపైగా కెమిస్టులు, ఆన్లైన్ ఫార్మసీల నియంత్రణలేని కార్యకలాపాలు మరియు అన్యాయ డిస్కౌంట్ విధానాలకు వ్యతిరేకంగా వీధుల్లోకి రానున్నారు.అక్రమ ఈ-ఫార్మసీలు మరియు భారీ డిస్కౌంట్ల కారణంగా దాదాపు 5 కోట్ల మంది ఆధారపడిన కుటుంబాల జీవనాధారం ప్రమాదంలో పడింది.దేశవ్యాప్తంగా 12.40 లక్షలకుపైగా కెమిస్టులు మరియు ఔషధ పంపిణీదారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అఖిల భారత కెమిస్టులు మరియు డ్రగ్గిస్టుల సంఘం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా 2026 మే 20 బుధవారం ఒకరోజు దేశవ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వెంకటరత్నం తెలిపారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సమర్పించిన వినతిపత్రంలో, ఫార్మాస్యూటికల్ వ్యాపార రంగాన్ని ప్రభావితం చేస్తున్న కీలక సమస్యలపై పలు మార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని సంస్థ పేర్కొంది. దీని వల్ల దేశవ్యాప్తంగా కెమిస్టుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నట్లు తెలిపింది.ఏఐఓసిడీ అధ్యక్షుడు జె. ఎస్. షిండే మరియు ప్రధాన కార్యదర్శి రాజీవ్ సింఘాల్ సంయుక్తంగా మాట్లాడుతూ ఇది కేవలం వ్యాపారానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు, రోగుల భద్రతకు సంబంధించిన అంశం కూడా.ప్రభుత్వం మే 20 లోపు ఈ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే, మేము నిరవధిక ఆందోళన ప్రారంభించాల్సి వస్తుందని హచ్చరించారు.

## ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

**రీ-ఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టండి**
**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**ప్రజా సమస్యలను నిర్దేశిత గడువు (ఎస్ఎల్ఏ) దాటకుండా వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి దరఖాస్తును పరిశీలించి పెండింగ్ లో లేకుండా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు స్వయంగా అర్జిదారులతో మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా అర్జీదారులకు అందజేసే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. రీ-ఓపెన్ అయిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించాలన్నారు. ఎట్ టూ వ్యూ లో ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్ లో ఉండకూడదన్నారు. అధికారుల లాగిన్ లోకి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. సిఎంఓ కార్యాలయం నుండి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సునీత, రామసుబ్బయ్య జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కారుణ్య నియామకాల కింద వివిధ శాఖల్లో 21 మందికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు

**నియామక ఉత్తర్వులు అందజేసిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....**కారుణ్య నియామకాల కింద వివిధ శాఖల్లో 21 మందికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇస్తూ జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందచేశారు..సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరి యంలో కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ నియామక ఉత్తర్వులను అందచేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగాలు పొందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగ విధులను బాధ్యతయుతంగా నిర్వర్తించి ప్రజలకు మంచి చేయాలన్నారు.. ఎటువంటి అవినీతికి పాల్గొనకుండా సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. విధి నిర్వహణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవాలని, కష్టపడితే భవిష్యత్తులో మండల, డివిజన్ మరియు జిల్లా స్థాయి అధికారులుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, చొరవ చూపడం వల్ల తమకు ఉద్యోగ నియామకం జరిగిందని అభ్యర్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, రామసుబ్బయ్య, సెక్షన్ సిబ్బంది సన, తదితరులు పాల్గొన్నారు.

# జనరద్దీ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగరంలో జనరద్దీ ఎక్కువగా ఉండే రైతు బజార్లు, మార్కెట్ యార్డులు, పూల బజార్ వంటి ప్రాంతాల్లో పరిశుభ్రతపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం ఆయన కొండారెడ్డి బురుజు సమీపంలోని పూల బజార్, సి. క్యాంపు రైతు బజార్, వినాయక ఘాట్ వద్ద కే.సీ. కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో నిత్యం జనరద్దీ ఉండే ప్రజా సమూహ ప్రాంతాల్లో పరిశుభ్రత పనులపై తప్పనిసరిగా ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని గార్బేజ్ పాయింట్లు లేకుండా చూడాలన్నారు. ప్రతి రోజూ ఉదయం సందర్శించి, ప్రత్యేక సిబ్బందిని నియమించి విధులు కేటాయించాలని సూచించారు. కొత్తగా కొనుగోలు చేసిన ట్రాక్టర్ ట్రాలీలలోనే వ్యర్థాలను వేసేలా నిర్వాహకులకు, వ్యాపారస్తులకు చైతన్యం కల్పించాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను అకస్మిక తనిఖీ చేశారు. స్వచ్ఛత పనుల విషయంలో ప్రభుత్వ ఆదేశాల అమలులో నిర్లక్ష్యంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. స్వచ్ఛత పట్ల సిరియస్ లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, జిలానీ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



# గడువులోపు పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారం

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

### ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 16 అర్జీలు




**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలకు నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 16 అర్జీలు వచ్చాయి. అర్జీదారులచే సమస్యలను విన్నా కమిషనర్, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ఎస్‌ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, ఇంచార్జీ సిటి ప్లానర్ వెంకటరమణ, మేనేజర్ జునైద్, ఆర్వోలు స్వర్ణలత, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన ధనుష్‌కు అభినందనలు...

### శాలువాతో సన్మానించి, అభినందించిన...

### కర్నూలు అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్ పూర్ లో ఏప్రిల్ 24 నుండి 28 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీలలో కర్నూలు స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వీరేష్ కుమారుడు ధనుష్ విశేష ప్రతిభ కనబరిచారు. 105 కేజీల సబ్ జూనియర్ విభాగంలో 130 కేజీల బరువును డెడ్ లిఫ్టింగ్ చేశారు. ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో బంగారు పతకం సాధించి కర్నూలు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా ధనుష్‌ను శాలువతో అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి లోకేష్ మరియు ఆర్గనైజర్ సెక్రటరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

# భవన నిర్మాణ అనుమతులు ఇక మరింత సులభం





### ఏపీడీపీఎంఎస్ 2.0తో వేగవంతమైన సేవలు

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** భవన నిర్మాణాలు, లేఅవుట్లకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం మరింత సులభతరం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన పురపాలక, నగరపాలక సంస్థల ప్రణాళికా సిబ్బంది, లైసెన్స్ టెక్నికల్ పర్సన్లకు ఏపీ పట్టణాభివృద్ధి శాఖ ప్రవేశపెట్టిన ఏపీడీపీఎంఎస్ 2.0 ఆన్లైన్ విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీడీపీఎంఎస్ సాఫ్ట్‌టెక్ డైరెక్టర్ సంధ్యా, ప్రసాద్, సంజయ్ బృందం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కొత్త విధానంలోని ముఖ్యాంశాలను విపులంగా వివరించారు. తాజా ఆన్లైన్ విధానం ద్వారా ఇళ్లు, అపార్ట్మెంట్లు, వాణిజ్య భవనాల నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను సులభంగా దరఖాస్తు చేసి, వేగంగా పొందవచ్చని తెలిపారు. అలాగే భూములను ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు అవసరమైన లేఅవుట్ అనుమతులను కూడా ఆన్లైన్ ద్వారానే పొందే విధంగా వ్యవస్థను రూపొందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఏపీడీపీఎంఎస్ 2.0 ద్వారా నిర్మాణ, లేఅవుట్ అనుమతుల జారీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారిందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఆన్లైన్ ద్వారానే దరఖాస్తు నుంచి అనుమతి వరకు అన్ని సేవలను పొందవచ్చన్నారు. ఈ విధానం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు సేవల నాణ్యత కూడా మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో అనంతపురం ప్రాంతీయ సంచాలకులు కెఎండీ ఇసాక్, ఇంచార్జి సిటీ ప్లానర్ వై.వి. వెంకటరమణ, కుడా పీఓలు బి. విజయ్ భాస్కర్, యూ. మోహన్ కుమార్, ఏపీడీపీఎంఎస్ సాఫ్ట్‌టెక్ డైరెక్టర్ సంధ్యా, క్రెడాయ్ చైర్మన్ గోరంట్ల రమణ, క్రెడాయ్ అధ్యక్షుడు జె. సురేష్ కుమార్, లెస్సా చైర్మన్ మురళీ మోహన్ రావు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం ...

### కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 94 ఫిర్యాదులు.



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 94 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...** 1) మా కుమారునికి కెవి సబ్ స్టేషన్ లో కాంట్రాక్ట్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ . 4 లక్షలు తీసుకొని మోసం చేసిన కర్నూలు, శ్రీనగర్ కాలనీ చెందిన నాగేంద్రుడు పై చర్యలు తీసుకోవాలని కర్నూల్ మండలం, బి. తాండ్రపాడు గ్రామానికి చెందిన నాగలింగం ఫిర్యాదు చేశారు. 2) వర్షం కి పత్తి తడుస్తుందని చెబితే కట్టించిన ఇల్లు బాడిగకు ఇచ్చాను. 10 సంవత్సరాల నుండి ఇల్లు ఖాళీ చేయడం లేదు . బాడిగ ఇవ్వడం లేదని చర్యలు తీసుకొని న్యాయం చేయాలని గూడూరు మండలం , బూడిదపాడు గ్రామానికి చెందిన చిన్న హుస్సేన్ మియా ఫిర్యాదు చేశారు. 3) 16 ఎకరాల పొలాన్ని ఆక్రమించుకున్న వారి పై చర్యలు తీసుకోవాలని తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన దస్తగిరమ్మ ఫిర్యాదు చేశారు. 4) ఇల్లు ఆక్రమించుకున్న వారి పై చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరుకు చెందిన జయమ్మ ఫిర్యాదు చేశారు. 5) వార్త ఆఫీస్ దగ్గర వక్ఫ్ బోర్డు స్థలంలో అక్రమంగా కట్టడాలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కర్నూల్ ,పాతబస్తీ బూడెం ఖాన్ మసీదుకు చెందిన మునీర్, తదితరులు ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ తో పాటు సీఐ లు శివశంకర్, రామయ్య నాయుడు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యలో రాణించాలి.






### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.

**భీమవరం బ్యూరో చీఫ్ మే 11నంది పత్రిక** భీమవరం వన్‌టౌన్‌లోని ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో భీమవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుచూ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మానవతా సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు, నగదు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యలో ముందుకు సాగాలని సూచించారు. ఇతర విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా విద్యపై పూర్తి దృష్టి సారిస్తేనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. విద్య ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులను అధిగమించి సమాజంలో మంచి స్థానం సంపాదించవచ్చని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా అబ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతిభా అవార్డులు, నగదు పురస్కారాలు అందిస్తున్న మానవతా సంస్థ సేవలను ఆయన అభినందించారు. సంస్థ గౌరవ డైరెక్టర్ పెనుమత్స రామ్మోహన వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ, భీమవరం పట్టణం మరియు మండల పరిధిలోని 23 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు మొత్తం రూ.44,000 నగదు పురస్కారాలు, జ్ఞాపికలు, మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో పోటీ భావన, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ మాట్లాడుతూ, మానవతా సంస్థ విద్యా రంగంతో పాటు అనేక సేవా కార్యక్రమాలను సంవత్సరం పొడవునా నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. విద్యార్థులు ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయులు మరియు మెరిట్ విద్యార్థులకు డాక్టర్ దీప్తి రాజు మరియు వారి మిత్రబృందం తరఫున ఒక్కొక్కటి రూ.600 విలువైన 27 చేతి గడియారాలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బుద్దరాజు వెంకటపతి రాజు, ఇన్‌చార్జి అధ్యక్షులు ఎస్.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి వడ్డి వెంకటేశ్వరరావు, కో-చైర్మన్ కారుమూరి నరసింహమూర్తి బాబు, కోశాధికారి గ్రంధి కుమార్ వెంకటేశ్వర వరప్రసాద్, కలిగొట్ల గోపాల శర్మ, సీతారామరాజు, అల్లు శ్రీనివాస్, ఎం.ఈ.ఓ. సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

# జులై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' చట్టం: కేంద్రం

జీవనోపాది భద్రత, గ్రామీణ ప్రజల ఆదాయ కల్పన కోసం 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని జులై 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ (వీబీ-జీ-రామ్-జీ)ను తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టాన్ని జులై నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ లభిస్తుందని తెలిపింది. జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఈ-కేవైసీ ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది.

# ఆటో నగర్ లో 100 కోట్ల భారీ కుంభకోణం.





## భూ కుంభకోణం పై సమగ్ర విచారణ చేయాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీకి వినతి పత్రం.

**4.50 ఎకరాల మున్సిపల్ గ్రీనరీ స్థలం...పంట కాల్వలు ఆక్రమించి విక్రయించి సొమ్ముచేసుకున్నారు.**

**తెలుగుదేశం పార్టీ గతంలో స్థలాలు ఇచ్చారు...వైసిపి హయాంలో అమ్ముకున్నారు.**

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళతా.**

**ఆటో నగర్ బాధితులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటా.**

**ఆటో నగర్ కు చెందిన అన్ని శాఖలు విచారణ చేయాలి.**

**తప్పుచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.**

**నంద్యాల సిటీ బ్యూరో మే 11 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణశివారులోని ఆటో నగర్ పారిశ్రామిక ప్లాట్లు కేటాయింపులో 100 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు.భూ కుంభకోణంపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా,జిల్లా ఎస్పీ సునీల్ షెరా న్ కు వినతి పత్రం అందించారు.అనంతరం భూమా విలేకరులతో మాట్లాడుతూ ఉప ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మికులను దృష్టిలో పెట్టుకొని ఆటో నగర్ ప్రాంతానికి ప్రత్యేక జీవో ఇచ్చి అక్కడ సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు.ఆటో నగర్లో అర్హులైన వారికి కాకుండా నిబంధనలకు విరుద్ధంగా వారి అనుచరులకు,కుటుంబసభ్యులకు



స్థలాలు కట్టబెట్టారని ఆరోపించారు.అధికారులపై వత్తిడి తెచ్చి అక్రమంగా రిజిస్టర్లు చేయించుకోవడం వెనుక పెద్ద కుట్ర జరిగిందన్నారు.ఆటోనగర్ లో అప్పట్లో 300 మందికి ప్లాట్లు కేటాయించి రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు.2019 లో వైసిపి అధికారంలో కి వచ్చిన తర్వాత వైసీపీ కి చెందిన కొందరు కౌన్సిలర్స్,కొందరు సభ్యులు ఆటో నగర్ అసోసియేషన్ లో చేరి స్థలాలు అన్యాయంగా సంబంధం లేని వారికి విక్రయించారన్నారు.ఆటో నగర్ భూములు అన్యాక్రాంతంగా ఇతరులకు విక్రయించిన వాటిని వెనక్కు తీసుకొచ్చి బాధితులకు న్యాయం చేయాలని వినతి పత్రాలు అందించామన్నారు. ఆటోనగర్ లో కార్మికుల జీవితాలను దృష్టిలో పెట్టుకొని 46 ఎకరాల స్తలం టీడీపీ హయాంలో ఇచ్చిన వాటిని ఆటో నగర్ వాసులకు ఒకొక్కరికి 5 నుంచి 10 సెంట్లు ఇవ్వాల్సింది.అక్కడ ఆటో నగర్ అసోసియేషన్ సభ్యులు ఇష్టారాజ్యంగా ప్రవేటు వ్యక్తులకు,కుటుంబ సభ్యలకు 20,30,40 సెంట్లు రిజిస్టర్ చేయించారన్నారు.నిబంధనల ప్రకారం ఒక కుటుంబంలో ఒకరికే స్థలాలు ఇవ్వాలని నిబంధనలు ఉన్నా వారికి నచ్చిన వారికి విక్రయించి 100 కోట్ల భారీ భూ కుంభకోణం చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు.గతంలో ఆర్డీఓ విచారణ చేసి 100 కోట్ల కుంభకోణం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకొని పోయిన విషయాన్ని గుర్తు చేశారు.ఆటో నగర్ లో ప్రభుత్వం కేటాయించిన 46 ఎకరాల్లో ఎకరాకు మున్సిపాలిటీ గ్రీనరీ కి 10 సెంట్లు చొప్పున ఇవ్వాల్సిన మున్సిపాలిటీ గ్రీనరీ స్థలం దాదాపు 4.50 ఎకరాలు ఎక్కడ ఉన్నాయి అని అడిగితే సమాధానాలు లేవన్నారు. ఆటో నగర్ కు సంబంధించి అన్ని శాఖలు విచారణ చేయాలని డిమాండ్ చేశారు.ఆటో నగర్ భూ కుంభకోణం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి కార్మికులకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉంటానన్నారు.ఆటో నగర్ లో పంటకాల్వలు సైతం కబ్జా చేసి సొమ్ము చేసుకున్నారన్నారు. తప్పుచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలన్నారు.ఆటో నగర్ లో భూ కుంభకోణాలు, నిధుల మళ్లింపు,డబ్బులు ఎవరెవరికి ఇచ్చారు,ఎవరికి ఖర్చులు పెట్టారు,జమా ఖర్చులు అన్ని బయటికి వస్తాయని అన్నారు.2014 నుంచి ఆటో నగర్ కు సంబంధించిన లెక్కలు,అసోసియేషన్ కు వచ్చే బాడుగ లు సొసైటీ కి జమచేయకుండా ఇష్టం వచ్చినట్టు ఖర్చులు పెట్టి అడిగితే దాడులు,బెదిరింపులు జరిగాయని ఆటో నగర్ అసోసియేషన్ లోని మరో వర్గం నాయకులు పేర్కొన్నారు.ఆటో నగర్ ఏర్పాటు సమయంలో 360 మంది సభ్యులు ఉండేవారని,ప్రస్తుతం 600 మంది సభ్యులు ఉన్నారన్నారు.ఆటో నగర్లో పని చేస్తున్న వారికి స్థలాలు ఇస్తామని దాదాపు 50 నుంచి 60 మంది వద్ద లక్ష నుంచి 5 లక్షలు తీసుకొని నేటివరకు స్థలాలు ఇవ్వలేదని ఆరోపించారు.ఆటో నగర్ వాసులకు స్థలాలు రావడానికి ఆ నాడు భూమా నాగిరెడ్డి పుణ్యం వల్ల స్థలాలు వచ్చాయని,నేడు అబ్బాయి భూమా బ్రహ్మానందరెడ్డి మా స్థలాలు కాపాడటానికి ముందుకు వచ్చారని పేదల సమస్య పరిష్కరించాలంటే భూమా కుటుంబమే ముందుంటుందని అన్నారు.






## కాలు బెనకటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన

# జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి**

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ మే 11నంది పత్రిక** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కాలు బెనకటంతో, ఆమె భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సాధారణ వ్యక్తి లాగానే ఓపీ నమోదు చేయించుకుని ఎక్స్ రే తీయించుకుని, ఆర్థోపెడిక్ విభాగంలో వైద్య చికిత్స పొందారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని పలు విభాగాలను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, వైద్య సిబ్బంది పనితీరు తదితర అంశాలపై రోగులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యత ఎలా ఉంది, అవసరమైన మందులు అందుతున్నాయా, వైద్యులు మరియు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారా, ఆసుపత్రి పరిసరాలు మరియు వాష్‌రూమ్‌లు పరిశుభ్రంగా ఉన్నాయా, ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా వంటి పలు అంశాలపై రోగులను ప్రశ్నించారు.రోగులు స్పందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని, గతంతో పోలిస్తే వైద్య సేవలు మరింత మెరుగుపడ్డాయని తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సౌకర్యాలు బాగున్నాయని రోగులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు జిల్లా యంత్రాంగం దశలవారీగా చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యశాఖ పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రతి నెల వైద్యశాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖలతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం ద్వారా లోటుపాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆసుపత్రుల్లో ఏవైనా సమస్యలు, లోటుపాట్లు గమనించినట్లయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు..



## కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడులను తక్షణమే విరమించుకోవాలి.

**సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజ్**



**కేసముద్రం, మే 11(నంది పత్రిక):**సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సెంటర్లో కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడు ప్రతులను సిఐటియు ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు మాట్లాడుతూ గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, కార్మిక హక్కుల్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటినుండి కార్మికులకు, రైతులకు, ప్రజలకు వ్యతిరేకంగా పాలనను కొనసాగిస్తూ నాలుగు లేబర్ కోడలుగా చేసి పని గంటలు పెంచి వేతనాలు తగ్గించే కార్మిక హక్కుల్ని హరించే విధంగా, బడా పెట్టుబడి దారులకు, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను చేస్తూ కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక ప్రజ ఓట్లతో గద్దెనెక్కి కార్మికులకే వెన్నుపోటు పొడుస్తున్న నాయకులను ప్రజలు, కార్మికులు సహించబోరన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, బిజెపి ప్రభుత్వానికి వంతపాడుతున్న ప్రభుత్వాలు స్పందించి కార్మికులకు వ్యతిరేకమైన కార్మిక చట్టాలను అమలు చేయకుండా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు చాగంటి కిషన్, మంగీలాల్, బిక్షపతి, శ్రీనివాస్, రవి, ప్రకాష్, సరిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పీఎంశ్రీ జెడ్పిహెచ్ఎస్ కేసముద్రం స్టేషన్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం.




**కేసముద్రం, మే 11(నంది పత్రిక):**99 రోజుల ప్రజా పాలన అభివృద్ధి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలలో మొదటి రోజు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం స్టేషన్లో వేసవి శిక్షణ శిబిరాన్ని కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు చక్కని శిక్షణ తీసుకొని వివిధ రకాల స్కిల్స్ నేర్చుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో అనవసర తిరుగుళ్ళు, ఎండ దెబ్బ బారినా పడకుండా పాఠశాలలో శిక్షణ కార్యక్రమాలు నేర్చుకోవడం ద్వారా ప్రత్యేక స్కిల్స్ నేర్చుకోవడానికి అవకాశం ఉందన్నారు. మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి, సమావేశ అధ్యక్షులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బందెల రాజులు మాట్లాడుతూ విద్యార్థులు ఈ సదవకాశాన్ని తమ స్కిల్స్ నేర్చుకోవడానికి డ్రాయింగ్ అండ్ రైటింగ్, ఇండోర్ గేమ్స్ మొదలగు వాటిని నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్నాక్స్, స్టేషనరీ అందించడం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ మంజుల, మండలం లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య, చంద్రశేఖర్, రాజశేఖర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 50 మంది విద్యార్థులు




## ఆలయం కోసం కేటాయించిన భూమి దేవాలయానికే దక్కాలి.

**తాళ్లపూసపల్లి గ్రామ పెద్దల డిమాండ్.**



**కేసముద్రం, మే 11(నంది పత్రిక):**తాళ్లపూసపల్లి గ్రామంలో నెలకొన్న స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం కోసం కేటాయించిన భూమిని కొందరు బ్రాహ్మణులు ఆక్రమించాలని చూస్తున్నారని, ఆ భూమిని వ్యక్తిగత అవసరాల కోసం వాడుకుంటే చూస్తూ ఊరుకోమని గ్రామ పెద్దలు డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాల కిందట దేవాలయం కోసం కేటాయించిన భూమి కొందరు వ్యక్తిగత అవసరాల కోసం ఆక్రమించాలని చూస్తున్నారన్నారు. ఈ భూమి దేవాలయ అభివృద్ధి కోసమే కేటాయించాలని, దీని కోసం ఎక్కడికైనా వెళ్తామన్నారు. సోమవారం బ్రాహ్మణులు పెట్టిన అక్రమ కేసుపై కోర్టుకు హాజరైన గ్రామ పెద్దలు రావుల రవిచంద్ర రెడ్డి, గొర్రె వెంకన్న, బండి శ్రీను, గొడిశాల వెంకన్న, నరేటి కొమురయ్య, నార్ల రమేష్, మాచర్ల రాములు తదితరులు పై విధంగా డిమాండ్ చేశారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ, మినరల్ వాటర్ బాటిళ్లు సరఫరా.

**ఎండల దృష్ట్యా కూలీలు జాగ్రత్తలు పాటించాలి.**

**బిచ్యా నాయక్ తండా సర్పంచ్ రవి నాయక్**



**కేసముద్రం, మే 11(నంది పత్రిక):**ఎండల దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలని, శరీరంలో గ్లూకోజ్ స్థాయి తగ్గకుండా ద్రవ పదార్థాలు తీసుకోవాలని బిచ్యా నాయక్ తండా సర్పంచ్ వాంకుడోత్ రవి నాయక్ ఉపాధి హామీ కూలీలకు సూచించారు. సోమవారం ముఖ్య అతిథిగా హాజరైన కేసముద్రం ఏపీవో యాకాంబరం సమక్షంలో కేసముద్రం మండలం లోని బిచ్య నాయక్ తండ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్ నగర్ తండ, బిచ్యనాయక్ తండ, హరిచంద్రు తండాలకు చెందిన సుమారు 300 మంది ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ వాంకుడోత్ రవినాయక్ ఆధ్వర్యంలో మజ్జిగ, మినరల్ వాటర్ బాటిళ్లను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ రాము, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, మేట్ నరేష్, సన్నీ దేవల్, సుమన్, గ్రామ పంచాయతీ సిబ్బంది రవి, సోమ్లా, మారు తదితరులు పాల్గొన్నారు.

# దళారుల దందాను అరికట్టలేని అధికారులు.

## సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్



**కేసముద్రం, మే 11(నంది పత్రిక):**కేసముద్రం వ్యవసాయ మార్కెట్ సమీపంలో జరుగుతున్న దళారుల దందాను మార్కెట్ అధికారులు అరికట్టలేక పోతున్నారని సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ విమర్శించారు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో పత్రిక ప్రకటన విడుదల చేస్తూ దన్నసరి సొసైటీ ఆధ్వర్యంలో మార్క్ ఫెడ్ సంస్థ ద్వారా మార్కెట్ తో పాటు వివిధ గ్రామాలలో మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారన్నారు. కాంటాలు పెట్టిన బస్తాలను రవాణా చేసేందుకు లారీలు లేక, గన్ని సంచుల కొరత వల్ల రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపుల పడాల్సి వస్తుందన్నారు. రైతులు పండించిన పంటను విక్రయించేందుకు తీసుకు వస్తున్న సమయంలో కొంతమంది దళారులు మార్కెట్ కు వెళితే ఆలస్యంతో పాటు రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తుందని మాయమాటలు చెప్పి రైతుల సరుకులను మార్కెట్ బయటనే కొనుగోలు చేసి జీరో దందా నిర్వహిస్తున్నారన్నారు. దీనివల్ల మార్కెట్ ఆదాయానికి గండిపడడమే కాకుండా, తేమ సాకు చూపుతూ ధర తగ్గిస్తూ, వేబ్రిడ్జిల వద్ద తూకం వేసి మిల్లులకు, ట్రేడింగ్ కంపెనీలు తీసుకొని వచ్చిన ట్రాక్టర్ల నుంచి 30 కేజీల మక్కలను తరుగు పేరుతో కోత విధిస్తూ దోపిడి చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా నగదు డబ్బులు కావాలంటే ఒక్క శాతం డబ్బులను కట్ చేస్తూ, లేకపోతే వాయిదా పద్ధతిలో చెక్కులను ఇస్తూ బ్యాంకుల చుట్టూ రైతులను ప్రదక్షణాలు చేయిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తతంగం జరుగుతున్న మార్కెట్ అధికారులు కళ్ళున్న కబోది లాగా వ్యవహరించడం సిగ్గుచేటనీ, ఈ విషయంపై మార్కెట్ అధికారులు చర్యలు తీసుకుపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ దందా అంతా మార్కెట్ అధికారుల కనుసన్నలలో జరుగుతుందా అని అనుమానం వ్యక్తం చేశారు. తక్షణమే మార్కెట్ అధికారులు చొరవ చూపి జీరో దందాను అరికట్టి, రైతులను మోసం చేసే దళారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మే నెల లోపు ఇంటి పన్ను చెల్లించండి 5/ శాతం రాయితీ పొందండి. డిప్యూటీ ఎంపీడీవో (జి ఎస్ డబ్ల్యూ) అశ్విన్ కుమార్.-



**శిరివెళ్ల :(నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల ఇంటి పన్ను చెల్లింపు దారులకు ప్రభుత్వం సువర్ణ అవకాశం కల్పించినట్లు (జి ఎస్ డబ్ల్యూ) డిప్యూటీ ఎంపిడిఒ అశ్విన్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటిపన్ను చెల్లింపు దారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పిందని ఇంకా బకాయి ఉన్నవారు, 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందుగానే ఇంటి పన్ను చెల్లించాలనుకొనే వారు మే నెలాఖరులోగా పన్ను ముందస్తుగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా పన్నును చెల్లించాల్సి ఉంటుందని సోమవారం తెలిపారు. కేవలం ఇంటి పన్నుకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని చెప్పారు. పాత బకాయిలు, ఇతర పన్నులు, ఫీజులు లేదా యూజర్ చార్జీల చెల్లింపుపై ఎటువంటి రాయితీ ఉండదన్నారు. కావు న ఇంటి పన్ను చెల్లించే గురవ యజమానులు ఐదు శాతం పైతీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# పోస్టుల భర్తీ లో వైద్యశాఖ నిర్లక్ష్యం

**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 11:** జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న ఫార్మసిస్టు పోస్టులను భర్తీ చేయడంలో వైద్యశాఖ అలసత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్యం పరిధిలో ఏళ్ల తరబడి నుండి ఫార్మసిస్టుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే ఫార్మసిస్టుల పాత్ర ఎంతో ఉంటుంది. మందులు ఇండెంటు పెట్టడం, ఆరోగ్య కేంద్రాలకు సరఫరా అయ్యే మందులు ఎక్స్పైర్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సబ్ సెంటర్లకు సకాలంలో మందులను సరఫరా చేయడం,వ్యాక్సిన్, టీబి మందులను ఇవ్వడంలో జాగ్రత్తలు వహించడం తదితరు అంశాలపై ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఫార్మసిస్టుల పోస్టులను భర్తీ చేయడంలో వైద్యశాఖ ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని మోత్కూరు, దీబగుంట్ల, జిల్లెల్ల, రుద్రవరం,పేరు సోముల, మాయలూరు,నారాయణపురం, టంగుటూరు,బండి ఆత్మకూరు తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఫార్మసిస్టుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రాథమిక పోస్టులను భర్తీ చేయడంలో జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని ప్రజారోగ్యాన్ని కాపాడే విషయంలో చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే గంగుల నాని సారిక రెడ్డి దంపతులకు హృదయపూర్వక వివాహ దినోత్సవ శుభాకాంక్షలు.



**శిరివెళ్ల (నంది పత్రిక)** (హైదరాబాద్) ఆళ్లగడ్డ అసెంబ్లీ మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి ఆయన ధర్మపత్ని సారిక రెడ్డి దంపతులకు శిరివెళ్ల వైసీపీ కాపు యువనేత ముడిమేల సందీప్ కుమార్ రాయల్ హృదయపూర్వక పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్ పట్టణంలో ఉన్నటువంటి మాజీ ఎమ్మెల్యే గంగుల నాని గారు నేడు వివాహ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా సందిప్ రాయల్ హైదరాబాద్ వెళ్లి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. నిండు నూరేళ్లు ఆదర్శ దంపతులుగా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు సందీప్ రాయల్ తెలియజేశారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ వినియోగం తప్పనిసరి.. భౌతిక ఫైళ్ళకు ఇకపై తావులేదు






## కఠిన ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

## ఫైళ్ల పరిష్కారం లో జాప్యంపై సీరియస్

## ఆడిట్ టీమ్‌లతో తనిఖీలకు ఆదేశం

## రెండు రోజుల గడువు విధింపు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

**వైయస్సార్ కడప జిల్లాబ్యూరో చీఫ్ , మే 11:నంది పత్రిక** డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల నిర్వహణ కేవలం ఈ-ఆఫీస్ ద్వారానే తప్పనిసరిగా జరగాలని, భౌతిక ఫైళ్లను వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ సమావేశపు హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, డిఆర్ఓ మల్లికార్జునుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

అనంతరం అధికారుల సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ఆఫీసు ద్వారా ఫైల్స్ పంపాలని గత ఆరు నెలలుగా ఆదేశాలు ఉన్నప్పటికీ, కొన్ని కార్యాలయాల్లో అంతర్గత ఫైళ్లను ఇంకా భౌతికంగానే నడుపుతున్నారని, ఇది క్రమశిక్షణారాహిత్యమే కాకుండా చట్టవిరుద్ధమని ఆయన హెచ్చరిస్తూ, మంగళవారం సాయంత్రం లోపు ప్రతి కార్యాలయం నుండి ఫైళ్ల గణాంకాలను సమర్పించాలని ఆదేశించారు.ప్రతి అధికారి తమ లాగిన్ లోకి వచ్చిన ఫైల్‌ను గరిష్టంగా రెండు రోజుల్లోపు పరిష్కరించాలని, జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లావ్యాప్తంగా ఆడిట్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అధికారుల పనితీరును విశ్లేషిస్తూ, జిల్లా కలెక్టర్ స్థాయిలో తాను నెలకు సుమారు 1500 ఫైళ్లను సగటున ఒక రోజు 13 గంటల్లో పరిష్కరిస్తుండగా, డీఆర్వో కేవలం రెండు గంటల్లోనే ఫైళ్లను క్లియర్ చేస్తున్నారని ప్రశంసించారు. అలాగే ఏవో కలెక్టరేట్ 10 గంటల 57 నిమిషాలు, సబ్ కలెక్టర్ భావన 9 గంటలు, రిమ్స్ డెప్యూటీ డైరెక్టర్ 19 గంటలు, డీఈఓ 2 రోజుల 49 నిమిషాలు, ఐసీడీఎస్ పీడీ 3 రోజుల సగటు సమయాన్ని తీసుకుంటున్నారని వివరించారు. అయితే, కొందరు ఆర్డీవోలు, మున్సిపల్ కమీషనర్లు ఫైళ్ల పరిష్కారానికి 6 నుండి 11 రోజుల సమయం తీసుకోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ, ఇకపై ప్రతి వారం ఈ పనితీరుపై సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ఈవేదిక ద్వారా అందే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. ముఖ్యంగా వేసవిలో ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికం గానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు.. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఎస్డీసి వెంకట పతి, జడ్పి సిఇఓ సుబ్రమణ్యం, డిఆర్డిఏ పిడి జి.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్లు రంగస్వామి, శివరామిరెడ్డి,ఇన్చార్జి డిపిఓ వెంకట సుబ్బయ్య, ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి.





## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, మే 11(నంది పత్రిక):**సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం, ఇతర వేదికల ద్వారా ప్రజల సమస్య పరిష్కారం నిమిత్తం సామాన్య ప్రజలు చేసుకున్న ప్రతి ఒక దరఖాస్తుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ తక్షణమే పరిష్కరించి నివేదికను సమర్పించాలని, తమ పరిధిలో లేని పక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంతో పాటు తొర్రూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నుండి వచ్చిన ప్రజావాణి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాకేష్, మహబూబాబాద్ జిల్లాలో అమలు చేస్తున్న ప్రజావాణి ప్రక్రియ యాప్ విధానాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ ను అడిగి తెలుసుకుని స్వయంగా పరిశీలించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ విభాగానికి 58, పంచాయతీరాజ్ 14, డిఆర్డిఓ 12, హౌసింగ్, డబుల్ బెడ్ రూమ్ 24, మున్సిపల్ 9, మొత్తం అన్ని విభాగాలలో కలిపి 133 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 9 దరఖాస్తులు వచ్చాయని ఆర్డీవో క్రిష్ణవేణి తెలిపారు. తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 14 దరఖాస్తులు వచ్చాయని ఆర్డిఓ గణేష్ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సత్వర సేవలు అందించాలనే మంచి ఉద్దేశంతో ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం డివిజనల్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, అందువలన ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సాత్వికకు సన్మానం



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 11:** 10వ తరగతి పరీక్షా ఫలితాలలో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన పెద్దపాటి సాత్వికను సోమవారం సన్మానించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలలో 595 మార్కులు సాధించిన సాత్విక మండలంలోని టాపర్ గా నిలిచింది. ఈ మేరకు అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి సాత్వికను శాలువతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రమణమ్మ, ఆనందమ్మ, నాగరాజమ్మ, రామేశ్వరమ్మ, రాజమ్మ, శశికళ, సునీత తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో సాత్విక మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## నా బెంగళూరు బుర్రకి ఇది అర్థం కావట్లేదు: హైదరాబాద్‌పై యువకుడి పోస్ట్ వైరల్

"నా బెంగళూరు బుర్ర ఇది అర్థం చేసుకోలేకపోతోంది"... అంటూ బెంగళూరుకు చెందిన ఓ యువకుడు చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్ నగరంలోని రోడ్లు, ప్రయాణ సౌకర్యాలను చూసి ఆశ్చర్యపోతూ అతడు ఈ వ్యాఖ్య చేశాడు.

# రైతులు వ్యవసాయ పనిముట్లు కు దరఖాస్తు చేసుకోండి

## వ్యవసాయాధికారి జీరాగణేష్



**మంత్రాలయం , న్యూస్ :-** మంత్రాలయం మండలంలోని రైతులు వ్యవసాయ పనిముట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వెంటనే రైతులు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జీరాగణేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు రైతులు ఈనెల 19 లోపు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తుల సమర్పించాలని , 20 నుంచి 22వ తేదీ వరకు రైతులు మార్పులు చేర్పులు ప్రక్రియ ఉంటాయని ,23వ తేదీ నుంచి 25 తేదీ వరకు లాటరీ ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారులను జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఆమోదంతో లాటరీ ద్వారా దరఖాస్తుదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన రైతులకు ఈ నెల 26 నుంచి జూన్ 2 తేది వరకు రైతులకు నానో సబ్సిడీ పోర్షన్ కట్టడానికి అవకాశం కల్పిస్తారని , మే 26 నుంచి జూన్ 26 తేది వరకు రైతులకు యంత్ర పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. సన్నకారు , ఎస్సీ ,ఎస్టీ రైతులు 50 శాతం సబ్సిడీ , జనరల్ కేటగిరీ రైతులకు 40 శాతం సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు ఇవ్వడానికి అనుమతి వచ్చిందన్నారు. ఎంపికై రైతులకు అందజేసే యంత్ర పరికరాలు ట్రాక్టర్ పరికరాలు విత్తడం , నాటడం , మరియు ట్రాక్టర్లు , మినీ ట్రాక్టర్లు ( 40 హెచ్ పి లోపు ) ,పవర్ టిల్లర్లు , హార్వేస్టింగ్ , నూర్పిడి , తదితర యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి





## పీజీఆర్ఎస్‌లో 151, రెవెన్యూ క్లినిక్‌లో 42 అర్జీలు స్వీకరణ

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ మే 11నంది పత్రిక** ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. అధికారులు పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీ అప్పారావు, జిల్లా రెవెన్యూ అధికారి శివన్నారాయణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర్లు తదితర అధికారులు ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి సంతృప్తి కలిగే విధంగా శాశ్వత పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ఏ ఒక్క అర్జీ కూడా రీఓపెన్ కాకుండా నాణ్యతతో కూడిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా అర్జీదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని, సమస్య తీవ్రతను బట్టి సంబంధిత అధికారులకు తక్షణ చర్యల కోసం సూచనలు చేశారు. నేడు నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 151 అర్జీలు, రెవెన్యూ క్లినిక్‌లో 42 అర్జీలు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, భూ, పింఛన్, గృహ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన జి.కృష్ణమూర్తి ప్రస్తుతం పక్షవాతంతో బాధపడుతూ కదలలేని పరిస్థితిలో ఉన్నానని, తనకు 93 శాతం వికలాంగత్వం ఉన్నట్లు సదరం ధృవపత్రం ఉన్నందున వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.వీరవాసరం మండలం తోలేరు గ్రామానికి చెందిన ఎం.చంద్రశేఖర్ తన వారసత్వ భూమి రిజిస్ట్రేషన్‌లో 0.30 సెంట్లు ఉండగా, ఆన్‌లైన్ రికార్డుల్లో 0.21 సెంట్లు మాత్రమే నమోదైందని పేర్కొంటూ భూమిని రీసర్వే చేసి సరైన వివరాలు నమోదు చేయాలని కోరారు. లి భీమవరం మండలం గూట్లపాడు గ్రామానికి చెందిన జి.గంటయ్య తన పిత్రార్జిత స్థలానికి వెళ్లే దారిని పక్కస్థల యజమానులు అడ్డగోడలు కట్టి మూసివేశారని, సమస్య పరిష్కరించి రాకపోకలకు అనుమతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.పాలకోడేరు మండలం గొల్లకోడేరు గ్రామానికి చెందిన కె.రామలక్ష్మి తన కుమారుడి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ, పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన కలిత సంగీత తనకు నివాసయోగ్యమైన ఇల్లు లేక అద్దె ఇంట్లో ఇద్దరు కుమార్తెలతో నివసిస్తున్నానని, ఇళ్ల స్థలం మంజూరు చేయాలని కోరారు.భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన దండు శ్యామలాదేవి తన భూమి ఆన్‌లైన్ రికార్డులు మరియు అడంగులలో తేడాలు ఉన్నాయని పేర్కొంటూ రీసర్వే చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.

**పారిశ్రామిక మార్గదర్శక కేంద్రంలో 6 దరఖాస్తులు**

వశిష్ట సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక మార్గదర్శక కేంద్రంలో సోమవారం మొత్తం 6 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. వీటిలో పుట్టగొడుగుల పెంపకం యూనిట్, నాచురల్ ఫార్మింగ్ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్, ఆక్వాకల్చర్ యూనిట్, పికిల్ యూనిట్, వుడ్‌వర్క్ తయారీ యూనిట్, వాటర్ పార్క్ ఏర్పాటు సంబంధిత ప్రతిపాదనలు అందునట్లు తెలిపారు. ఈ సమావేశంలో వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి జిల్లాలో 41 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

## క్రీడాకారులకు అవసరమైన పరికరాల పంపిణీ

## జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ పొందాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరంబ్యూరో చీఫ్ మే 11, నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ మండలాల్లో యువత, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు మొత్తం 41 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు భీమవరం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కలిసి సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో శిక్షణ ఇస్తున్న 16 మంది కోచ్‌లకు బాస్కెట్‌బాల్‌లు, ఫుట్‌బాల్‌లు, చెస్ బోర్డులు, బాక్సింగ్ కిట్లు తదితర క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకుని తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సమ్మర్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. క్రీడల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. శిక్షణ శిబిరాలకు హాజరయ్యే విద్యార్థులు, క్రీడాకారులకు వేసవి తీవ్రత దృష్ట్యా చిక్కీలు, నిమ్మరసం, అరటిపండ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో నిర్వహిస్తున్న అన్ని సమ్మర్ కోచింగ్ క్యాంపులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని జిల్లా క్రీడా అధికారి మోహన్ దాస్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శిక్షణా కార్యక్రమాలు సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకొని భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. మే నెలాఖరు వరకు ఈ సమ్మర్ కోచింగ్ సెంటర్లు కొనసాగనున్నాయని, జిల్లాలోని ప్రతి విద్యార్థి, యువకుడు ఈ శిక్షణా శిబిరాల్లో పాల్గొని ప్రయోజనం పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ అధికారి మోహన్ దాస్, కోచ్‌లు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూ రీ సర్వేలో భారీ అక్రమాలు..?

## రైతుల భవిష్యత్తుపై మాజీ సర్పంచ్ రమణారెడ్డి ఆందోళన

**కలసపాడు, మే 11 (నంది పత్రిక ):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న భూ రీ సర్వే ప్రక్రియలో ప్రజల సమస్యల పరిష్కారం కంటే భవిష్యత్‌లో రహదారులు, కాలువలు తదితర కనీస అవసరాల సమస్యలు మరింత జటిలమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెల్లపాడు మాజీ సర్పంచ్, వైఎస్సార్సీపీ నేత గూడపు రెడ్డి రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఆయకట్టు భూములను ఒకే సర్వే నంబర్‌లో భారీ విస్తీర్ణంగా చూపిస్తూ, కలసపాడు 1బి, అయవారిపల్లె పొలాలు మరియు మండలంలోని ఇతర ప్రభుత్వ భూములను పూర్తిగా సబ్ డివిజన్ చేయకుండా పట్టాలు మంజూరు చేశారని ఆయన ఆరోపించారు. చెరువుల వద్దకు వెళ్లే రహదారులు, పైపొలాలకు దారులు, కాలువలు మరియు ప్రజల కనీస అవసరాలకు అవసరమైన భూములను విడగొట్టకుండా, ఒకే సర్వే నంబర్‌లో వందలాది మంది రైతులకు "పైకి పైకి" అనే లెటర్ల్ విధానంలో పట్టాలు ఇచ్చారని తెలిపారు.రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం కంటే ఎక్కువగా భూములు పట్టాల రూపంలో ఇచ్చిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఉదాహరణకు తెల్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 2, 258 మరియు కొండపేట గ్రామంలోని 218, 213, 186/1 సర్వే నంబర్లలో రహదారులు, స్మశానాలు తదితర ప్రజా అవసరాల భూములను సరిగా చూపించలేదని విమర్శించారు.కనీస సౌకర్యాలకు అవసరమైన భూములను విడిచి పెట్టకుండా, మిగిలిన భూములను రైతుల పేర్లతో రీసర్వేలో పొందుపరచకుండానే పాత రికార్డుల ప్రకారమే రీసర్వే పూర్తయిందని పై అధికారులకు నివేదికలు పంపించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు.దీనివల్ల భవిష్యత్‌లో ప్రతి గ్రామంలో రహదారులు, కాలువలు మరియు ప్రజా అవసరాల కోసం తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, ముఖ్యంగా ఎక్కువ దరఖాస్తు భూములు ఉన్న గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెల్లపాడు మాజీ సర్పంచ్, కలసపాడు ప్రాంత నాయకుడు, వైఎస్సార్సీపీ నేత గూడపు రెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.





## ప్రకృతి వైద్యులు డా.వేగిరాజు గోపాలరాజు సేవలు చిరస్మరణీయం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరంబ్యూరో చీఫ్ మే 11,నంది పత్రిక .** ప్రకృతి వైద్య సేవలకు జీవితాంతం అంకితభావంతో సేవలందించిన ప్రముఖ ప్రకృతి వైద్యులు డా.వేగిరాజు గోపాలరాజు స్మారకార్థం సోమవారం భీమవరం ప్రకృతి ఆశ్రమంలో సంతాప సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా హాజరై డా.గోపాలరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డా.వేగిరాజు గోపాలరాజు సేవలు సమాజానికి ఎనలేనివని పేర్కొన్నారు. తమ తాతగారు, తల్లిదండ్రులు ఏర్పాటుచేసిన ఆశయాలను కొనసాగిస్తూ, గ్రామాన్ని వదలకుండా ప్రకృతి ఆశ్రమంలోనే నిరంతరం వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ప్రకృతి వైద్యంపై నమ్మకం ఉంచి, పేద ప్రజలకు అందుబాటులో వైద్యం అందించడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న అనేక మందికి ఆయన ప్రకృతి వైద్యంతో ఉపశమనం కలిగించారని, వేలాది కుటుంబాల్లో ఆరోగ్యంపై నూతన ఆశలు నింపారని తెలిపారు. సేవాభావం, నిబద్ధత, మానవత్వం కలగలిపిన వ్యక్తిత్వం డా. గోపాలరాజుదని, ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, డా. వేగిరాజు రామకృష్ణంరాజు, వేగిరాజు శివవర్మ, డా.మూర్తి, గోకరాజు పాండురంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీకి నూతన రహదారిని ఏర్పాటు చేయాలి.

### కాలనీలో ఉన్న డంపింగ్ యార్డ్ ను మరో చోటుకు మార్చాలి.

### తహసీల్దార్ కు సమస్యలతో కూడిన వినతిపత్రం ను సమర్పించిన జగనన్న కాలనీవాసులు- ఆర్ఎస్. రంగాపురం.



**బేతంచర్ల మే 11 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామము రైల్వే గేట్ సమీపంలో ఉన్న, జగనన్న కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు సూర్యనారాయణ, బండల భాష, బాలయ్య, కాలనీ వాసులు కలిసి సోమవారం బేతంచెర్ల మండల తహసిల్దార్ నాగమణికి సమస్యలతో కూడిన వినతిపత్రమును అందజేశారు. బేతంచర్ల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ నాగమణి,బేతంచెర్ల ఎంపీడీవో ఫజల్ రహమాన్ మరియు బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ డి.హరి ప్రసాద్ ల ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లోభాగంగా రంగాపురం జగనన్న కాలనీ వాసులు వినతిపత్రంను అందజేశారు. అనంతరం కాలనీవాసులు అధికారులతో మాట్లాడుతూ,మా కాలనీ సమీపంలో, గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డ్ ఉందని, దాని ద్వారా ఇళ్లల్లోకి దుర్వాసన, నిత్యం పొగ వస్తుందని,ఆ పొగ వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయని,భయాందోళనకు గురవుతున్నాము అని తెలిపారు.కాబట్టి ఆ డంపింగ్ యార్డ్ ను కాలనీ నుండి మరోచోటికి మార్చాలన్నారు. అంతే గాకుండా,మా కాలనీకి ఉండే రహదారిని ఎన్ హెచ్, రైల్వే వారు తీసివేశారని అన్నారు. కాబట్టి మా కాలనీకి నూతన రహదారిని ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు.సంబంధిత అధికారులు మా జగనన్న కాలనీ వాసుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నేడే హనుమత్ జయంతి.

### హనుమంత్ జయంతి వేడుకలకు సిద్ధమైన దేవాలయం.





**రుద్రవరం ప్రతినిధి మే 11 (నంది పత్రిక):** మండల కేంద్రంలోని పడమటి వీధిలో వెలసిన శ్రీ ప్రతాపరుద్ర ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం (మే 12న) హనుమత్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా రేపు ఉదయం 4 గంటలకే స్వామివారికి పంచామృతాలతో విశేష అభిషేకం, పూల అలంకరణ మరియు ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. ఉదయం 10:45 గంటలకు మన్యుసూక్త, పురుషసూక్త, దుర్గాసూక్త, సుదర్శన, లక్ష్మీగణపతి మరియు నవగ్రహ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడతాయి. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి గ్రామ ఉత్సవం జిల్లేల్ల వారి కోలాటం బృంద ప్రదర్శనలతో కోలాహలంగా సాగనుంది. రాత్రి 8 గంటలకు తువ్వపల్లె బృందం వారిచే చెక్క భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు వారణాసి గోపిశర్మ, ఆంజనేయస్వామి వారి భక్త బృందం ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలకు భక్తులందరూ తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ మరియు గ్రామ పెద్దలు కోరుతున్నారు.

## మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

తమ పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు నెల రోజుల పాటు వాడవాడలా జెండా పండుగలు నిర్వహించనున్నట్లు కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ప్రకటించింది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మే 20 నుండి జూన్ 20 వరకు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి వరకు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహిస్తామని తెలిపింది. పార్టీ ఆవిర్భావ సభలో తెలిపిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వివరిస్తారని వెల్లడించింది. నేడు తెలంగాణ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎక్కడికక్కడ గళమెత్తవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు ఇప్పటికే సూచించినట్లు తెలిపింది. అందులో భాగంగా రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక సమస్యల పట్ల కూడా అక్కడి శ్రేణులు స్పందించడం, అవసరమైనచోట పోరాటానికి సిద్ధంగా ఉంటారని తెలిపింది. టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా కార్యకర్తలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావాలని పిలుపునిచ్చింది. కలిసి వచ్చే వారిలో సమాజం పట్ల బాధ్యత, అంకితభావం కలిగిన చురుకైన కార్యకర్తలతో సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపింది.

## భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు చేపట్టండి.

**ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.**




**తిరుపతి బ్యూరో చీఫ్ మే 11నంది పత్రిక** నగరంలో ఉత్పత్తి అయ్యే భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా వచ్చిన పిర్యాదులను సోమవారం ఉదయం క్షేత్ర స్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. అలాగే ఈఎస్ఐ హాస్పిటల్ సమీపంలోని అన్న కాంటీన్లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పడేస్తున్నారనే పిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాలను తూకివాకం వద్ద గల ప్లాంట్ కు తరలించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ఆరోగ్య విభాగపు సిబ్బందిని ఆదేశించారు. అన్న కాంటీన్లలో పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు తెలిపారు. అలాగే నాణ్యమైన ఆహార పదార్థాలు సమయానికి అందించాలని తెలిపారు. ఇంచార్జి కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, డి. ఈ. రాజు, సర్వేయర్ కోటేశ్వరరావు, టి.పి.ఎస్. వంశీ, తదితరులు ఉన్నారు.



హనుమాన్ జయంతి విశిష్టత

భక్తికి నిలువుటద్దం, శక్తికి మారుపేరు ఆంజనేయుడు. రామనామ స్మరణతో పులకించిపోయే ఆ వాయుపుత్రుడు జన్మించిన రోజే 'హనుమాన్ జయంతి'. లోక రక్షణ కోసం, అధర్మాన్ని అణచడం కోసం శివుని అంశతో జన్మించిన హనుమంతుని వేడుకలు దేశవ్యాప్తంగా అంబరాన్నంటుతాయి. ఇంతకీ ఈ పర్వదినం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటి? ఆ రోజున హనుమంతుడిని ఎలా పూజించాలి?

## హనుమాన్ జయంతి ఎందుకు జరుపుకుంటాం?



పురాణాల ప్రకారం, త్రేతాయుగంలో అంజనాదేవి, కేసరి దంపతులకు మహాశివుని అనుగ్రహంతో హనుమంతుడు జన్మించాడు. చైత్ర మాసం శుక్ల పక్ష పౌర్ణమి నాడు మంగళవారం (కొన్ని ప్రాంతాల్లో వైశాఖ బహుళ దశమి నాడు) హనుమంతుడు ఉద్భవించినట్లు పురాణాలు చెబుతున్నాయి. సూర్యుడినే పండు అనుకుని మింగబోయిన అసాధారణ శక్తిమంతుడు, శ్రీరాముని కార్యసిద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పరమ భక్తుడు హనుమంతుడు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని భక్తులు ఈ ఉత్సవాన్ని జరుపుకుంటారు.

**ఈ రోజు ప్రత్యేకత ఏమిటి?** హనుమాన్ జయంతి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది ఒక శక్తి సంచయం. ఆ రోజున హనుమంతుడిని స్మరిస్తే కలిగే ఫలితాలు ఏమిటంటే"హనుమాన్ చాలీసా" పఠించడం వల్ల మానసిక భయాలు, ఆందోళనలు తొలగి ధైర్యం కలుగుతుంది. శని ప్రభావంతో బాధపడేవారు హనుమంతుడిని పూజిస్తే ఉపశమనం లభిస్తుందని భక్తుల నమ్మకం. హనుమంతుడు 'బుద్ధిబలం, యశస్సు, ధైర్యం' ప్రసాదించే దేవుడు. ఈ రోజున చేసే ప్రార్థనలు త్వరగా ఫలిస్తాయని పెద్దలు చెబుతారు.

**పూజా విధానం – భక్తులు చేయవలసినవి:** ఉపవాసం: జయంతి రోజున భక్తులు తెల్లవారుజామునే స్నానం చేసి ఉపవాస దీక్ష చేపడతారు. సింధూర అలంకరణ: స్వామికి సింధూరం అంటే ఎంతో ప్రీతి. హనుమంతుడి విగ్రహానికి సింధూర లేపనం చేయడం, సింధూరాన్ని తిలకంగా ధరించడం శుభప్రదం.

ఆకు పూజ: తమలపాకులతో హనుమంతుడిని పూజిస్తే కష్టాలన్నీ తొలగిపోతాయి.

చాలీసా పఠనం: ఆలయాల్లో సమూహంగా హనుమాన్ చాలీసా లేదా సుందరాకాండ పఠించడం ఈ రోజు ప్రత్యేకత. "మనోజవం మారుతతుల్యవేగం.. జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్" అంటూ ఆంజనేయుని స్మరిస్తూ, ఈ జయంతి వేళ ఆ పవన పుత్రుని ఆశీస్సులు పొందుదాం. నేటి ఆధునిక కాలంలో ఒత్తిడి, ఆందోళనలతో సతమతమవుతున్న యువతకు హనుమంతుని జీవనశైలి ఒక స్ఫూర్తి. అంకితభావం, అపారమైన శక్తి ఉన్నా అణకువగా ఉండటం వంటి లక్షణాలు హనుమంతుడి నుంచి నేర్చుకోవాలి. ఈ హనుమాన్ జయంతి మనందరిలో కొత్త ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపాలని కోరుకుందాం.

**సేకరణ: పెరుమాళ్ళ వెంకట సురేంద్ర (రుద్రవరం ప్రతినిధి)**

## యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ



**బనగానపల్లె మే 11నందిపత్రిక** యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం లో సోమవారం సందర్భముగా స్వామిఅమ్మవార్ల పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమము లో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పాండురంగా రెడ్డి, ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి, పాతపాడు మహేష్ రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కెమిస్టుల జీవనాధారం,ప్రజారోగ్య రక్షణ కోసం.

**మే 20 న దేశవ్యాప్త బంద్ కు పిలుపు.**
**ఆన్లైన్ లో మందుల అమ్మకాలు నిలిపివేయాలి.**
**కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్ ను నిలిపివేయాలి.**
**నకిలీ మందుల అమ్మకాన్ని నివారించాలి.**
**ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్స్, డ్రగిస్ట్ అసోసియేషన్.**



**నంద్యాల సిటీ బ్యూరో మే 11 ( నంది పత్రిక ).** కెమిస్టుల జీవనాధారం,ప్రజారోగ్య రక్షణ కోసం మే 20 న దేశ వ్యాప్త బంద్ కు పిలుపునిస్తున్నామని నంద్యాల జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.రమేష్ బాబు,బి .దామోదర్ రెడ్డి పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శులు కరుణ కుమార్ గుప్తా,పి.వెంకటరత్నం ఆదేశాల మేరకు బంద్ పాటిస్తామని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 12.40 లక్షలకు పైగా కెమిస్టులు,ఆన్లైన్ ఫార్మసీల నియంత్రణ లేని కార్యకలాపాలు,అన్యాయ డిస్కౌంట్ విధానాలకు వ్యతిరేకంగా విధుల్లోకి రానున్నారని అన్నారు.అక్రమ ఈ ఫార్మసీలు, భారీ డిస్కౌంట్ కారణంగా దాదాపు 5 కోట్ల మంది ఆధారపడిన కుటుంబాల జీవనాధారం ప్రమాదంలో పడిందన్నారు. దేశవ్యాప్తంగా 12.40 లక్షలకు పైగా కెమిస్టులు,ఔషధ పంపిణీ దారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అఖిల భారత కెమిస్టులు, డ్రగిస్ట్ ల సంఘం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా మే 20 బుధవారం ఒకరోజు దేశవ్యాప్తంగా బంద్ ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ కి సమర్పించిన వినతి పత్రంలో ఫార్మాస్యూటికల్ వ్యాపార రంగాన్ని ప్రభావితం చేస్తున్న కీలక సమస్యలపై పలు మార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదన్నారు. దేశవ్యాప్తంగా కెమిస్టుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది అన్నారు.ప్రధాన ఆందోళన అంశాలను వివరించారు.అక్రమ ఈ ఫార్మసీలు ,ప్రజారోగ్యానికి అన్నారు.ఈ ఫార్మసీ ప్లాట్ఫార్ములు నియంత్రణ సడలింపులు దుర్వినియోగం చేస్తున్నాయని సమస్త ఆరోపించిందన్నారు. భౌతిక ధృవీకరణ లేకుండా మందులు విక్రయించడం వల్లే ఒకే ప్రిస్క్రిప్షన్ పదే, పదే ఉపయోగించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.ఏ వన్ ఆధారిత నకిలీ ప్రిస్క్రిప్షన్ లు ,యాంటీబయాటిక్స్ ,అలవాటు కలిగించే మందుల నియంత్రణ లేని లభ్యత వల్ల యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు పెరుగుతాయని ఏ, ఐ,ఓ,సి,డి పేర్కొంది అన్నారు.ఇది ప్రజారోగ్యంతో నేరుగా రాజీ పడటమేనని సమస్త అభిప్రాయపడింది అన్నారు.అన్యాయ ధరల విధానం వల్ల పెద్ద కార్పొరేట్ సంస్థలు అధిక డిస్కౌంట్ల ద్వారా మార్కెట్ సమతుల్యాన్ని దెబ్బ తెస్తున్నాయని అన్నారు.అవసరమైన మందులపై లాభాల మార్జిన్లు ప్రభుత్వం ద్వారా నిర్ణయించబడినప్పటికీ కొన్ని సంస్థలు అన్యాయ పోటీనిస్తున్నాయని ఆరోపించారు.గ్రామీణ ప్రాంతాల్లో కెమిస్టుల జీవనాధారం ప్రమాదంలో పడుతుందని,చివరకు ప్రజలకు అందుబాటులో ఉన్న ఔషధ వ్యవస్థ దెబ్బతింటుందని అన్నారు.అత్యవసర నోటిఫికేషన్ల ఉపసంహరణలో ఆలస్యం,కోవిడ్ – 19 సమయంలో 2020 మార్చి 26 న జారీ చేసిన అత్యవసర నోటిఫికేషన్ తాత్కాలిక చర్య మాత్రమేనని,దానిని ఇప్పటికీ కొనసాగించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

ఈ నిబంధన డ్రగ్ రూల్ 65 లోని కఠిన నియమాలను,బలహీనపరుస్తుంది అని,డిజిటల్ ప్లాట్ఫార్ములు దీనిని ఉపయోగించి నియంత్రణ భద్రతా వ్యవస్థలను ఉల్లంఘిస్తున్నాయని అన్నారు.మా ప్రార్థన డిమాండ్ల కోవిడ్ కాలానికి సంబంధించిన తాత్కాలిక నోటిఫికేషన్ గ్ర.ఎ.తీ.220 ( వ ) ను తక్షణమే ఉపహరించుకోవాలన్నారు.ఈ ఫార్మసీ సంబంధిత గ్ర.ఎ.తీ.817 ( వ ) నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరారు.పెద్ద కార్పొరేట్ సంస్థల అన్యాయ భారీ డిస్కౌంట్ లను అరికట్టేందుకు" లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్" విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం మే 20 లోపు మా డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే మేము నిరవధిక ఆందోళన ప్రారంభించాల్సివస్తుందని అన్నారు.

## నగరపాలక సంస్థకు 40వినతులు.

**ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.**



**తిరుపతి బ్యూరో చీఫ్ మే 11నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 వినతులు వచ్చాయని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 26మంది వినతులు సమర్పించగా, 12మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా సామవాయి మార్గం రైల్వే గేట్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, ఈట్ స్ట్రీట్ వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, చెట్లు ఎండిపోకుండా నీరు పట్టాలని, టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, నగరంలో రోడ్డుకు అడ్డంగా కడుతున్న ఫ్లెక్సీ లకు అనుమతి ఇవ్వరాదని, ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగిస్తున్న తోపుడు బండ్లు తొలగించాలని, గొల్లవాణిగుంట, పూలవాణి గుంట పట్టా భూమిలోకి నీరు రాకుండా కరకట్ట ఏర్పాటు చేయాలని, వినాయకసాగర్ లోని స్విమ్మింగ్ పూల్ కు వెళ్లేందుకు ఎంట్రీ ఇబ్బందిగా ఉంది, మరో మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీలు తదితరులు ఉన్నారు.

## గృహహింస కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

భార్యను ఏ భర్త కూడా పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే సర్వ హక్కులు ఉన్నాయని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ గృహహింస కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. అనంతరం అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. అంతకుముందు పాట్నా హైకోర్టు కూడా అతని బెయిల్‌ను తిరస్కరించింది.నిందితుడు మద్యం మత్తులో భార్యపై దాడి చేశాడని బాధితురాలు తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు గాయమైందని అన్నారు. ఆ తర్వాత కర్రతోనూ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు మూడు వివాహాలు చేసుకున్నాడని కోర్టుకు తెలిపారు. ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలు అతడి మొదటి భార్య. బాధితురాలి వాదనలు విన్న న్యాయస్థానం, "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు? ఇలాగే వేధిస్తే ఆమె మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతుంది కదా. మీరు రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అని సూచించింది. నిందితుడి ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది.



# ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో అధికారులు సేవలందించాలి

**ప్రజల సానుకూల స్పందనలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరంబ్యూరో చీఫ్ : మే 11నంది పత్రిక** ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలపై సానుకూల స్పందన పెంపొందేలా అధికారులు శక్తివంచన లేకుండా పని చేసి, జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన మే 7, 8 తేదీల్లో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై సోమవారం జిల్లా కలెక్టర్ శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఒక ఒక నెలలో ఒక నియోజకవర్గంలో నాలుగు శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార నివేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. నెలలో నాలుగు వారాల పాటు ప్రణాళికాబద్ధంగా ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలు చేపట్టి, మొదటి వారంలో స్వీకరించిన అర్జీలకు చివరి వారానికి పూర్తి స్థాయి పరిష్కారం చూపేలా పారదర్శకత, జవాబుదారీతనంతో అధికారులు పనిచేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల కాలయాపన, వ్యయభారం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు ఇది మంచి వేదికగా ఉపయోగపడాలని తెలిపారు వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలో ఎక్కడా మంచినీటి కొరత తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, విఆర్వోలు తమ పరిధిలో నీటి సమస్యలు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. గృహాలు, ఇళ్ల స్థలాలపై చర్యలు వేగవంతం చేయాలిలి పేదలకు మంజూరు చేసిన గృహాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని, 22–ఏ భూ సమస్యలకు సంబంధించిన ఇళ్ల స్థలాల ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయాలని పేర్కొన్నారు

ఆచంటలో ఐటీఐ ఏర్పాటు కోసం అవసరమైన స్థల సేకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల డ్రాప్‌అవుట్‌లను నివారించి, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మోడల్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించి విద్యార్థుల చేరికలు పెంచాలని తెలిపారు. విద్యార్థుల లోటుతో ఏదైనా మోడల్ స్కూల్ మూసివేయాల్సిన పరిస్థితి వస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మీసేవ, ఇతర పోర్టల్స్ కు బదులుగా వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర యాప్‌లో వివిధ ధ్రువపత్రాలు, అనుమతులు కొరకు సేవలను పొందెల పౌరులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు అందరూ ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, విఆర్వోలు యాప్ ను సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. 50% పైబడి పూర్తయిన ప్రభుత్వ భవన నిర్మాణాల జాబితా ను సిద్ధం చేసి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు విద్యా రుణాలను విరివిగా మంజూరు చేయాలని, అలాగే ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు కూడా విద్యా రుణాలు మంజూరు అయ్యేలా పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు. ఫ్రీ స్కూల్స్‌లో విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడేలా ఎంపీడీవోలు, సూపర్వైజర్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా పర్యవేక్షించి, ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్షరాంధ్ర కార్యక్రమం అమల్లో రాష్ట్రవ్యాప్తంగా నూరు శాతం సాధించిన నాలుగు జిల్లాల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఒకటని, ఇదే విధంగా రాబోయే సంవత్సరంలో కూడా నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# బీజేపీ అవకాశవాద రాజకీయాలను కడప ప్రజలు తిప్పికొట్టాలి

## మతోన్మాద శక్తుల కుట్రలు ప్రజలు అప్రమత్తంగా గమనించాలి

## -సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** రాష్ట్రంలో బీజేపీ, మతోన్మాద శక్తులు అమలు చేస్తున్న అవకాశవాద రాజకీయాలను కడప ప్రజలు అప్రమత్తంగా గమనించాలని, ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టించే కుట్రలకు లోనుకావద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడమే బీజేపీ ప్రధాన అజెండాగా మారిందన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, కేంద్రం ఇచ్చిన హామీల అమలు వంటి కీలక అంశాలపై సమాధానం చెప్పలేని పరిస్థితిలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. 2018లో బీజేపీ ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ ఇప్పటివరకు అమలు కాలేదని, కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు హామీ పూర్తిగా గాలిలో కలిసిపోయిందని గుర్తుచేశారు. విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం నిధులు, పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలపై ప్రజలకు సమాధానం చెప్పకుండా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం దుర్మార్గ రాజకీయమన్నారు.

కడప నగరంలో కావాలనే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా కొన్ని మతోన్మాద శక్తులు వ్యవహరిస్తున్నాయని తప్పుపట్టారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చంద్రబాబు.. కడపలోని అల్మాస్‌పేట సర్కిల్‌ను టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా అభివృద్ధి చేస్తామని బహిరంగ సభలో ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం కడప కార్పొరేషన్ కూడా ఈ అంశంపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ప్రతిపాదనలు పంపిందన్నారు. ఇప్పుడు అదే అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం మతోన్మాద శక్తులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న పరిస్థితిని ఆసరాగా చేసుకొని కొందరు కావాలనే ఉద్రిక్తతలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

కడప నగరంలో సామరస్య వాతావరణాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కడపలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను చల్లార్చాలని, అన్ని వర్గాల ప్రజలతో చర్చలు జరిపి మత సామరస్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కుట్రపూరితంగా ప్రజలను రెచ్చగొట్టే శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైతే దాని పూర్తి బాధ్యత చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని ఈశ్వరయ్య హెచ్చరించారు. ప్రజలు మతం, కులం పేరుతో విడిపోకుండా ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడాలని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపైనే రాజకీయ చర్చలు జరగాలని కోరారు.

# లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

## మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు

**మంత్రాలయం , మే 11** లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు ని మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ మల్లికార్జున తో కలిసి మంత్రాలయం లోని లాడ్జి యాజమాన్యులతో అసాంఘిక కార్యకలాపాలు పై సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లాడ్జ్ లో గది తీసుకునే ప్రతి వ్యక్తి యొక్క పూర్తి వివరాలు నమోదు చేయాలి. తప్పనిసరిగా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు ఆధార్ కార్డ్ , డ్రైవింగ్ లైసెన్స్ , పాస్పోర్ట్ , తీసుకొని జిరాక్స్ / స్కాన్ కాపీ భద్రపరచాలి. గది ఇచ్చిన వారి పేరు, చిరునామా, మొబైల్ నెంబర్, వచ్చిన తేదీ & సమయం, వెళ్లిన తేదీ & సమయం రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అనుమానాస్పద వ్యక్తులు, నకిలీ గుర్తింపు పత్రాలు ఉపయోగించే వారు, లేదా అనుచిత ప్రవర్తన కలిగిన వ్యక్తులకు గది ఇవ్వకూడదు. మైనర్ బాలురు / బాలికలు అనుమానాస్పద పరిస్థితుల్లో వచ్చినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. వ్యభిచారం, జూదం, మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలకు నిర్వహించరాదు. ప్రతి లాడ్జ్ లో సీసీ కెమెరాలు పనిచేసే స్థితిలో ఏర్పాటు చేసి కనీసం 30 రోజుల వరకు ఫుటేజ్ భద్రపరచాలి. లాడ్జ్ సిబ్బంది వివరాలు కూడా పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలి. విదేశీయులు గది తీసుకున్న పక్షంలో సంబంధిత చట్టాల ప్రకారం వెంటనే సమాచారం ఇవ్వాలి. రాత్రి సమయంలో గది తీసుకునే వారి వివరాలను ప్రత్యేకంగా పరిశీలించాలి. ఎటువంటి గొడవలు, అనుమానాస్పద మరణాలు, దొంగతనాలు లేదా చట్టవిరుద్ధ సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు పూర్తి సహకారం అందించాలి. లాడ్జ్ లో శుభ్రత, అగ్ని ప్రమాద నివారణ చర్యలు మరియు అత్యవసర భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలి. పై సూచనలు పాటించని యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాలను పోలీసు స్టేషన్ లో ఇవ్వాలి

## -మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు

**మంత్రాలయం , మే 11,(నంది న్యూస్ ) :** ఇతర రాష్ట్రాల నుంచి పని కోసం వచ్చిన కార్మికుల వివరాలను కాంట్రాక్టర్లు , హోటల్ , లాడ్జి , వసతి గృహ యాజమానులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఇవ్వాలని మంత్రాలయం సిఐ దస్తగిరి బాబు ఆదేశించారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కాలంలో ఇతర రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కార్మికుల పేరుతో వచ్చి అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడం ,ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ మరియు నేరాల నివారణ దృష్ట్యా కార్మికులను పనిలో చేర్చుకునేటప్పుడు వారి పూర్తి వివరాలు సేకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ వద్ద నమోదు చేయించడం ప్రతి యజమాని, కాంట్రాక్టర్ మరియు బాధ్యులైన వ్యక్తుల చట్టబద్ధమైన బాధ్యతగా భావించాలన్నారు. వివిధ రాష్ట్రాల నుండి అనేక మంది కార్మికులు వచ్చి భవన నిర్మాణ పనులు, హోటళ్లలో సేవలు, ఇటుక బట్టీలలో పనులు, డ్రైవర్లుగా, గృహ సేవకులుగా, వాచ్‌మెన్లుగా, పరిశ్రమలలో మరియు ఇతర వృత్తులలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అటువంటి ఈ క్రమంలో ఎవరి వద్ద అయితే ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారో, వారు తమ వద్ద పనిచేస్తున్న ప్రతి కార్మికుడిని రెండు లేదా మూడు రోజులలోగా మంత్రాలయం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి హాజరు పరచాలన్నారు. అదేవిధంగా, ఆ కార్మికుల పూర్తి పేరు, తండ్రి పేరు, స్వస్థల చిరునామా, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, గతంలో పనిచేసిన ప్రదేశం, ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశం, యజమాని పేరు, కాంట్రాక్టర్ పేరు, ఫోటోలు మరియు ఇతర అవసరమైన వివరాలను పోలీసు శాఖ నిర్దేశించిన ప్రొఫార్మాలో పూర్తి చేసి సమర్పించాలన్నారు. పోలీసు శాఖ తరచూ నిర్వహించే తనిఖీలలో భాగంగా ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను ప్రశ్నించినప్పుడు, వారు ఎక్కడ పనిచేస్తున్నారు, ఎవరి వద్ద నివసిస్తున్నారు, ఎవరి ఆధ్వర్యంలో పనిచేస్తున్నారు అనే వివరాలు వెల్లడించిన సందర్భంలో, ఆ కార్మికుల వివరాలు పోలీస్ స్టేషన్ రికార్డుల్లో లేనట్లయితే సంబంధిత యజమాని, కాంట్రాక్టర్ లేదా బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కావున మంత్రాలయం పట్టణ ప్రజలందరూ, ముఖ్యంగా యజమానులు మరియు కాంట్రాక్టర్లు, ఈ విషయాన్ని అత్యంత ప్రాముఖ్యతతో తీసుకొని వెంటనే పోలీసు శాఖకు సహకరించి, అవసరమైన వివరాలు సమర్పించి, పట్టణ శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావలసిందిగా మంత్రాలయం గ్రామ ప్రజలకు సిఐ దస్తగిరి బాబు సూచించారు.



# పుట్టపర్తిలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధికి కొత్త దిశ




## లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఆమడగూరులో రూ.51 వేల కోట్ల రిలయన్స్ సోలార్ ప్రాజెక్ట్

## వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్న ప్రాజెక్టులు

## సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కృతజ్ఞతలు

**పుట్టపర్తి, బ్యూరో చీఫ్ మే 11:నంది పత్రిక** పుట్టపర్తి నియోజకవర్గంలో భారీ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఈప్రాంత అభివృద్ధికి కొత్త దిశ దక్కనుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. పుట్టపర్తిలో లక్ష కోట్ల వ్యయంతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఎంతో కృషి చేశారని పుట్టపర్తి ఎమ్మెల్యేపల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. అలాగే ఆమడగూరులో రూ.51 వేల కోట్లతో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుండటం నియోజకవర్గ రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తుందని పేర్కొన్నారు. ఈ పరిశ్రమలు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషితో సాధ్యమైందన్నారు. పుట్టపర్తిలో 650 ఎకరాలలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ప్రధాని నరేంద్ర మోడీ ఈ ప్రాంతంపై ఆసక్తి చూపారని అందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సత్యసాయిబాబా నడయాడిన పుణ్యక్షేత్రంపై ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక అభిమానం ఉందని గత ఏడాదిలో సత్య సాయి బాబా శతజయంతోత్సవాలకు విచ్చేసిన సందర్భంగా ఈ ప్రాంత ప్రజలపై ప్రత్యేక అభిమానంతో పరిశ్రమలు ఏర్పాటుకు ఎంతో మొగ్గు చూపారని కొనియాడారు. ఈనెల 15న పుట్టపర్తికి జూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో పాటు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ మరియు కేంద్ర మంత్రులు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తోపాటు ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇతర మంత్రులు పర్యటన సందర్భంగా ఏర్పాట్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, కేంద్ర రక్షణ శాఖ అధికారులు జిల్లా ప్రభుత్వ అధికారులు తదితరులు కలిసి జరుగుతున్న పనులను పరిశీలించారు.

ఈ పరిశ్రమల ద్వారా క్షేత్రస్థాయిలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకురావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే దేశ అభివృద్ధి దిశగా పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మే 15న పుట్టపర్తిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా ఎస్పీ సతీష్ బాబు, కేంద్ర రక్షణ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పుట్టపర్తి ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు.



# హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

## వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి




**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 11,నంది పత్రిక** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయిందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరములు పూర్తి అయినా కూడా ప్రజలకు ఇచ్చిన కొత్త పింఛన్లు, మహిళలకు ఆర్థిక సహాయం, యువతకు ఉద్యోగాల కల్పన, బీసీ లకు యాభై ఏండ్లకే పెన్షన్ వంటి హామీలు కేవలం మాటలకే పరిమిత మయ్యాయన్నారు. ముఖ్యంగా ఆళ్లగడ్డ నియోజక వర్గంలోని రైతుల సమస్యలపైనా ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రన్నారు. జిల్లా కేంద్రమైన నంద్యాల మార్కెట్ యార్డ్ లో రైతులకు పంటకొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ లో మొక్కజొన్న, జొన్న తదితర పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసిన పాపాన పోలేదన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికి అయినా ఎమ్మెల్యే స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కొత్తూరు సుబ్బరానికి 2.64 లక్షలు విరాళం..!



**నంది పత్రిక. పాణ్యం ప్రతినిధి. మే 11.** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన యున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 2 లక్షల 64 వేలు విరాళంగా దాతలు సోమవారం ఇచ్చినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. కర్నూలు పట్టణం రాఘు మయూరి నందు గల శివకుమార్ రమాదేవిల కుమారుడు, కోడలు వి.ఎస్.ఎన్ యశ్వంత్, తేజశ్విని వారి కుటుంబ సభ్యులు స్వామివారికి 1 కేజీ వెండి మొక్కుబడిగా గాను, వాటి నిమిత్తము 2 లక్షల 64 వేల రూపాయలు ఏపీజీబీ నందివర్గం బ్యాంక్ నుండి ఫిక్స్ డిపాజిట్ రూపంలో విరాళంగా ఇచ్చి వాటి నుండి ప్రతి సంవత్సరమునకు వచ్చు వడ్డీ ఆలయ అభివృద్ధికి తోడ్పడే విధంగా విరాళం ఇచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శేష వస్త్రములతో సత్కరించి ప్రసాదము, స్వామివారి చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నారాయణస్వామి గ్రామపంచాయతీ కార్యదర్శి సరస్వతి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# యాగంటి దేవస్థాన ఆలయ భూములకు వేలం

**బనగానపల్లె మే 11నందిపత్రిక** యాగంటి దేవస్థానం భూములకు 12.5.2026న వేలం పాట నిర్వహించునున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహనధికారి పాండురంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 సంవత్సరంకు సంబందించి దేవస్థానం హక్కువున్న భూములకు మునుగుత్త చెల్లించని,గతంలో కౌలు బకాయి ఉన్న భూములకు వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. ఔత్సాహికులు ధరావత్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చు అని కార్యనిర్రాహనాధికారి తెలిపారు.

# బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలి

**మెగా డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు తెలియజేసి ప్రభుత్వ బడిలో చేర్చాలి**

**అంగన్వాడీ లలో ప్రీ స్కూల్ పూర్తి చేసుకున్న పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్చాలి**

**బడి పిలుస్తోంది, అంగన్వాడీ లలో ప్రీ స్కూల్ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమంపై అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్**



**ఏలూరు, బ్యూరో చీఫ్ మే, 11 నంది పత్రిక :** ఐదు సంవత్సరాల వయస్సు నిండి అంగన్వాడీ ప్రీ స్కూల్ నుండి తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బడి పిలుస్తోంది, అంగన్వాడీ లలో ప్రీ స్కూల్ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమంపై అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలోని ప్రీ స్కూల్ నుండి 5 సంవత్సరాల వయస్సు దాటిన 7600 మంది చిన్నారులను పాఠశాలల్లో చేర్పించామని ఐసిడిఎస్ పీడీ కలెక్టర్కు తెలియజేయగా, ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 3929 మంది పిల్లలు మాత్రమే అడ్మిషన్స్ తీసుకున్నారని, ఈ మేరకు రిజిస్ట్రేషన్స్ అయ్యాయని డీఈఓ కలెక్టర్ కు తెలిపారు. ఈ వ్యత్యాసం ఎలా వచ్చిందని కలెక్టర్ అధికారులను ఆరా తీయగా మిగిలిన వారు ప్రైవేట్ పాఠశాలల్లో చేరారని తెలియజేసారు. ఈ విషయంపై కలెక్టర్ వెట్రిసెల్వి ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అంగన్వాడీ లలో ప్రీ స్కూల్ పూర్తి చేసుకున్నప్రతీ చిన్నారి తప్పనిసరిగా బడిలో చేరాలన్నారు. ప్రైవేట్ స్కూల్ లో జాయిన్ ఐన వాళ్ళ వివరాలను ఐసిడిఎస్ అధికారులు ధృవీకరించుకోవాలని, ప్రీ స్కూల్ పిల్లలు బడిలో చేరకపోతే ఐసిడిఎస్ అధికారులు బాధ్యులు అవుతారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులు అయిన ఉపాధ్యాయులు , ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోటు పుస్తకాలు, ఉచిత యూనిఫారాలు, డిజిటల్ క్లాసు రూమ్లు, నాణ్యమైన బోధన మరియు ఇంగ్లీష్ మీడియం, మధ్యాహ్న భోజనపథకం, క్రీడా స్థలాలు, క్రీడా పరికరాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు తదితర పథకాలపై తల్లితండ్రులకు అవగాహన కలిగించి వారిని ప్రభుత్వ పాఠశాలలు వైపు ఆకర్షించేలా చూసి, లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. జిల్లాలో మెగా డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు తెలియజేసి బడి బయట పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎస్సి పరీక్షలలో ఉతీర్ణులుకాని విద్యార్థులకు రెమిడీయల్ క్లాసులు నిర్వహించి సప్లిమెంటరీ పరీక్షలకు సంసిద్దులను చేసి ఉతీర్ణులు అయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డిఈఓ వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పీడీ శారద, ఎంఈఓ లు, సిడిపిఓ లు, పాల్గొన్నారు

# నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం... ఏపీకి వర్ష సూచన



నైరుతి బంగాళాఖాతంలో, ఉత్తర శ్రీలంక తీరానికి సమీపంలో ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం అదే ప్రాంతంలో కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడొచ్చని తెలిపారు. ఒకవైపు వర్ష సూచన ఉన్నప్పటికీ, మరోవైపు వడగాలుల ప్రభావం కూడా ఉంటుందని ప్రఖర్ జైన్ హెచ్చరించారు. ముఖ్యంగా అల్లూరి జిల్లాలోని జికె వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు మండలాలతో పాటు, పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని చింతూరు, కూనవరం, మారేడుమిల్లి, వీఆర్ పురం, గుర్తేడు వంటి మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఇవి కాకుండా, మరికొన్ని జిల్లాల్లో ఎండ ప్రభావం యథాతథంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## “నిరుద్యోగ యువతకు సువర్ణ అవకాశం

### - వట్లూరులో 15న జాబ్ మేళా:

- పోస్టర్‌ను ఆవిష్కరించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ .



**దుగ్గిరాల,బ్యూరో చీఫ్ మే 11:నంది పత్రిక** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ( ఏపీ ఎస్ ఎస్ డి సి ) ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన జరగనున్న జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. పెదపాడు మండలం వట్లూరులోని టిటిడిసి (టీటీడీసీ ) సెంటర్‌లో ఈ నెల 15వ తేదీన నిర్వహించే ఈ జాబ్ మేళాలో 14కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. మొత్తం 1020 పైగా ఉద్యోగ ఖాళీలకు ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, పదవ తరగతి నుంచి బీటెక్ వరకు విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హత కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 8184887146, 9502798793 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి ప్రవీణ్ గారు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సామూహిక కీబోర్డ్ ప్లేయింగ్ కార్యక్రమంలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబర్చిన పెదవేగి మండలం పినకడిమి గ్రామానికి చెందిన తాటికొండ శృతి జ్యోతిక, తాటికొండ సంజయ్‌లను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. వారిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి, వారి సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో పలువురు కూటమి నాయకులు, అధికారులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి పలు కార్యక్రమాలకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు.

## నేడు హనుమాన్ జయంతిని జయప్రదం చేయండి..

### -గంగపుత్ర సంఘం పిలుపు..



**మంత్రాలయం, మే11, (నంది) :**నేడు మంత్రాలయంలో జరుగు హనుమాన్ జయంతి వేడుకలను గ్రామ ప్రజలు, భక్తులు జయప్రదం చేయాలని గంగపుత్ర సంఘం పెద్దలు, కుల బంధువులు సోమవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేడు (మంగళవారం) శ్రీ కోండాపురం ఆంజనేయస్వామి దగ్గర జరిగే అనుమాన్ జయంతి సందర్భంగా మంత్రాలయం పాత ఊరు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నుండి శ్రీ కొండాపురం ఆంజనేయస్వామి దేవాలయం వరకు పల్లకిలో ఊరేగింపు ఉంటుంది. ఉదయం ఎనిమిది గంటలకు ఉరేగింపు కార్యక్రమం ప్రారంభం అవుతుంది . శ్రీ కొండాపురం ఆంజనేయస్వామి దేవాలయం నందు మంగళ హారతి ఉంటుంది. అనంతరం పన్నెండు గంటలకు నుండి భోజన కార్యక్రమం లో పాల్గొనాలని తెలియజేస్తూ ఈ దైవ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు హాజరై హనుమాన్ జయంతి వేడుకలను దిగ్విజయం చేయగలరని కోరారు.

## వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

### నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి





**కల్లూరు నంది పత్రిక బ్యూరో...** ..కల్లూరు అర్బన్ :41వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 18 అడుగుల శ్రీ వీరాంజనేయ స్వామి రాతి విగ్రహం, పీఠంతో కలిపి 28 అడుగుల మహా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు కాటసాని రామభూపాల్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని కాటసాని స్వామివారిని ప్రార్థించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అక్కిమి హనుమంత రెడ్డి వార్డు నాయకులు పల్లె ప్రతాప్ రెడ్డి , గంగులు ,చిన్న మాధవ స్వామి,నాయుడు ,రాజు ,పామయ్య ,ఎరుకల రాజు , ఎ. మధు , భాస్కర్ రెడ్డి ,వెంకటేష్ ,అయ్యన్న ,సూర్య ప్రకాష్ రెడ్డి ,రమణ ,వడ్డే నాగరాజు ,డీలర్ ఖాదర్ ,పర్ల తిమ్మన్న , మాబుష ,చాకలి శేఖర్ ,షరీఫ్ ,విష మరియు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

## జూన్ 1 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం: పశ్చిమ బెంగాల్ సీఎం

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తామని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అన్నారు. జూన్ 1వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ప్రజారవాణాపై ఆధారపడే లక్షలాది మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఇందులో ఉద్యోగినులు, విద్యార్థులు కూడా ఉంటారని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కూడా వచ్చే నెల నుంచి అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్ళు పొడిగించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.



## జిల్లా కలెక్టర్‌ను అభినందించిన పారిశ్రామిక వర్గాల ప్రతినిధులు

### “హై వాల్యూ సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్”తో జిల్లాకు పారిశ్రామికాభివృద్ధికి కొత్త దిశ

### వ్యవసాయం, ఆక్వా ఆధారిత పరిశ్రమల ద్వారా అధిక ఆదాయం లక్ష్యం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరంబ్యూరో చీఫ్ : మే 11,నంది పత్రిక .** పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయం, ఆక్వా ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తూ హై వాల్యూ ఉత్పత్తుల తయారీ ద్వారా అధిక ఆదాయం సాధించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందిస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మే 7, 8 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా “హై వాల్యూ సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్”ను జిల్లా కలెక్టర్ సమగ్రంగా ప్రదర్శించారు. వ్యవసాయ, ఆక్వా వ్యర్థాలను వినియోగించి సంపదను ఎలా సృష్టించవచ్చో, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ ఎంఎస్ఎంఈ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. జిల్లాకు పారిశ్రామికాభివృద్ధి దిశగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సహజ వనరులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులను సమర్థవంతంగా వినియోగించి అధిక విలువ కలిగిన ఉత్పత్తుల తయారీకి మార్గం సుగమం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు తక్కువ విలువ కలిగిన ఉత్పత్తులకే పరిమితమైన పరిస్థితిని మార్చి, హై వాల్యూ ప్రొడక్ట్స్ తయారీ ద్వారా రైతులు, యువత, పారిశ్రామికవేత్తలకు అధిక ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ల సమావేశంలో ప్రదర్శించిన ముఖ్య అంశాలు.. జిల్లాలో వరి మిల్లింగ్ వ్యర్థాల నుండి సంపద సృష్టి అవకాశాలను వివరిస్తూ ... వరి పొట్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తి, సిలికా జెల్ తయారీ వరి తవుడు ద్వారా నూనె, పశుగ్రాస తయారీ, నూకలు, వరి గడ్డి ద్వారా ఇథనాల్ మరియు ఇతర ఉత్పత్తులు, ఆక్వా, సముద్ర ఉత్పత్తుల వ్యర్థరహిత శుద్ధి ప్రక్రియ, పశుసంపద వ్యర్థాల ద్వారా జీవశక్తి ఉత్పత్తి కోకో గింజల నుండి చాక్లెట్ తయారీ వరకు విలువ ఆధారిత శుద్ధి ప్రక్రియ “పశ్చిమగోదావరి సర్క్యులర్ ఎకానమీ మోడల్” ద్వారా నాలుగు ప్రధాన రంగాల్లో ఉప ఉత్పత్తులను సంపదగా మార్చే ప్రణాళిక తదితర అంశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ ప్రణాళిక ద్వారా జిల్లాలో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని, వ్యవసాయం, ఆక్వా ఆధారిత పరిశ్రమలు పెరగడం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. హై వాల్యూ ఉత్పత్తుల తయారీ ద్వారా జిల్లాకు మంచి ఆదాయం సమకూరడమే కాకుండా, పశ్చిమగోదావరిని పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జిల్లాగా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ ఇంటర్ ప్రాంచైజీల మాయాజాలం

### అనుమతులు లేకుండా విచ్చల విడిగా అడ్మిషన్లు

### రెండు లక్షల పైన ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలు

### చర్యలు తీసుకోవాలన్న విద్యార్థి నాయకులు కోనేటి వెంకటేశ్వర్లు, వాల్మీకి బాలక్రిష్ణ

**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** కార్పొరేట్ ప్రాంచైజీ విద్యాసంస్థల మాయాజాలానికి కర్నూలు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు బలవుతున్నారని, అనుమతులు లేకుండానే కార్పొరేట్ ప్రాంచైజీల పేరుతో ఇంటర్ అడ్మిషన్ల కోసం జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తూ మభ్యపెట్టి తమ కళాశాలల్లో చేర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇందు కోసం ప్రాంచైజీ కార్పొరేట్ సంస్థలు ఏజెంట్లను రంగంలోకి దింపారని, ఆ ఏజెంట్లు విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తూ ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, జేఈఈ అంటూ ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారని రాయలసీమ విద్యార్థి సంఘాల జెఎసి చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, కన్వీనర్ వాల్మీకి బాలక్రిష్ణ జిల్లా జాయింట్ కలెక్టర్ నూర్ కమల్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక కర్నూలు నగరంలోని కలెక్టరేట్ పిజిఆర్ఎస్ నందు ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆలస్యంగా అడ్మిషన్లు తీసుకుంటే ఫీజులు పెరుగుతాయని, సీట్లు దొరకవని పీఆర్వోల ద్వారా కార్పొరేట్ ప్రాంచైజీ కళాశాలలు చెబుతున్నాయని, అనుమతులు లేకుండా దర్జాగా తల్లిదండ్రుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని ఒప్పించి అడ్మిషన్ ఒప్పందాలు చేస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా సుమారు రెండు లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పీఆర్వోలు, ఎంజెంట్లు మాటలు విని చేర్పించిన తరువాత హాస్టల్‌లో సరైన వసతి



లేకపోవడం, భోజన సౌకర్యం సరిగ్గా లేక చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వసతులు లేక చదువు మానేసిన సంఘటనలు వివరించారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి కార్పొరేట్ ప్రాంచైజీలు రేజోనెన్స్, అలెన్, వేదాంతు, న్యానో సంస్థల పై చర్యలు తీసుకోవాలనే విధంగా ఆదేశాలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు కిరణ్, చంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హౌస్ సైట్లకు న్యాయం చేయాలి

### మంత్రి టీజీ భరత్‌ను కలిసిన మహేష్, హరినాథ్ రెడ్డి, సాయికుమార్ నాయుడు

### హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని వినతి

### జర్నలిస్టుల సంఘం తరపున మహేష్ బృందం పోరాటం

### కూడ ఆమోదించిన లేఅవుట్‌కు మౌలిక వసతులు కల్పించండి

### కలెక్టర్ సిరి, జేసీ నూర్ కమల్‌కు సంఘం విజ్ఞప్తి

### 19 నెలల విచారణ తర్వాత ఆమోదం

### ఇప్పటికైనా న్యాయం చేయాలని మహేష్ వినతి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**కర్నూలు జిల్లా జర్నలిస్టుల పరస్పర సహకార గృహ నిర్మాణ సహకార సంఘానికి చెందిన హౌస్ సైట్ల రద్దు ఉత్తర్వులను ఉపసంహరించుకోవడంతో పాటు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని సంఘం నాయకులు రాష్ట్ర పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్ మరియు వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్‌ను కోరారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులు సమగ్ర వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. సంఘం ప్రధాన కార్యదర్శి పి. మహేష్, జాయింట్ సెక్రటరీ ఎం. సాయికుమార్ నాయుడు, హరినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు మంత్రి టీజీ భరత్‌తో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూర్ కమల్‌ను కలిసి సమస్యను పూర్తిస్థాయిలో వివరించారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, ఖఖణూ ఆమోదాలు, రెగ్యులరైజేషన్ ప్రక్రియకు



సంబంధించిన పత్రాలను కూడా వారికి అందజేశారు.

**15.44 ఎకరాల భూమి విక్రయం** 2009లో ప్రభుత్వం కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు గ్రామ పరిధిలోని సర్వే నెం.478లో 15.44 ఎకరాల భూమిని కర్నూలు జిల్లా జర్నలిస్టుల పరస్పర సహకార గృహ నిర్మాణ సహకార సంఘానికి విక్రయించిన విషయాన్ని సంఘం నాయకులు గుర్తు చేశారు. ఈ భూమిని జర్నలిస్టుల గృహ నిర్మాణ అవసరాల కోసం ప్రభుత్వం చట్టబద్ధంగా కేటాయించిందని పేర్కొన్నారు.అయితే అనంతరం అప్పటి జిల్లా కలెక్టర్ =జజు1/1091/2022, తేదీ 18-08-2022 ప్రకారం గృహ స్థలాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో జర్నలిస్టులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు.

**హైకోర్టులో పోరాటం** ఈ రద్దు ఉత్తర్వులను సవాలు చేస్తూ జర్నలిస్టులు ఞ్రా నెం.29260/2022 మరియు ఞ్రా నెం.30302/2022 కేసులను ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో దాఖలు చేసినట్లు వివరించారు. మొదటి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు 13-09-2022న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి కలెక్టర్ ఉత్తర్వులను నిలిపివేసిందని తెలిపారు. అదే విధంగా రెండో పిటిషన్‌లో కూడా 26-09-2022న సమాన ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు.ఇది జర్నలిస్టుల సంఘం వాదనలకు న్యాయపరమైన బలం చేకూర్చిందని సంఘం నాయకులు వివరించారు.ఖఖణూ ఆమోదంతో బలమైన ఆధారాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ.ఎంఎస్ నెం.10, మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ (ఎం), తేదీ 08-01-2020 ద్వారా అనధికార లేఅవుట్లలోని వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందని తెలిపారు. ఆ అవకాశాన్ని వినియోగించుకుని సంఘానికి చెందిన ఏడుగురు జర్నలిస్టులు 2020 డిసెంబర్‌లో కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఖఖణూ) వద్ద దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం ఖఖణూ 2022 సెప్టెంబర్ 22న ఏడుగురు జర్నలిస్టుల వ్యక్తిగత ప్లాట్లను క్రమబద్ధీకరించిందని తెలిపారు.దీర్ఘకాలంగా 19 నెలలపాటు విచారణ జరిపిన తర్వాత మొత్తం లేఅవుట్‌కు ఞ్రూ 2020/ఖజూ-ఖఖణూ/ఖ×చీచీ/000085 నంబరుతో ఆమోదం లభించడం తమ వాదనలకు మరింత బలం చేకూర్చిందన్నారు.

**మౌలిక వసతుల కల్పనపై విజ్ఞప్తి** హైకోర్టు ఉత్తర్వులు అమలులో ఉన్న నేపథ్యంలో జర్నలిస్టుల కాలనీలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని సంఘం నాయకులు కోరారు. అలాగే ఈ భూమికి సంబంధించిన రికార్డులను రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖల్లో అధికారికంగా “జర్నలిస్టుల హౌస్ సైట్లు”గా నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**నాయకుల పాత్రపై ప్రశంసలు** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ప్రధాన కార్యదర్శి పి. మహేష్ నిరంతరం కృషి చేస్తున్నారని సంఘ సభ్యులు పేర్కొన్నారు. జాయింట్ సెక్రటరీ ఎం. సాయికుమార్ నాయుడు, హరినాథ్ రెడ్డి సమస్య పరిష్కారానికి అధికారులను కలిసి చట్టపరమైన అంశాలను వివరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సమస్యను సానుకూలంగా పరిశీలించి న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు వెల్లడించారు.

## అతనికి పేదరికం తెలుసా?... సీఎం విజయ్ గురించి క్లాస్ మేట్ సంచలన వ్యాఖ్యలు

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నటుడు విజయ్, తన బాల్యం గురించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. తాను పేదరికం చూశానని, ఆకలి అంటే ఏంటో తెలుసని ఆయన చేసిన ప్రసంగాన్ని.. ఆయన క్లాస్ మేట్, ప్రముఖ స్క్రీన్ రైటర్ మను జోసెఫ్ 'బుల్‌షిట్' (అర్థం పర్థం లేని వాగుడు) అంటూ తీవ్రంగా విమర్శించారు.

ఈ మేరకు మను జోసెఫ్ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. “విజయ్ మూడో తరగతిలో నా క్లాస్‌మేట్. మేమిద్దరం చెన్నైలోని సుప్రసిద్ధ లయోలా స్కూల్‌లో చదువుకున్నాం. అతని తండ్రి ఒక ఫిలింమేకర్. తన కొడుకును సినిమాల కోసమే తీర్చిదిద్దారు. అతను పేదరికంలో పెరిగానని చెప్పడంలో అర్థంలేదు“ అని పేర్కొన్నారు. “చాలా మంది ఫిలింమేకర్ల లాగే విజయ్ తండ్రికి ఆర్థిక ఇబ్బందులు వచ్చి ఉండొచ్చు. కానీ అది తమిళనాడు స్థాయిలో పేదరికం కాదు. ధనవంతులు ఆర్థికంగా దెబ్బతినడాన్ని, నిజమైన పేదరికంతో పోల్చకూడదు. రెండూ వేర్వేరు“ అని జోసెఫ్ వివరించారు.

ఆదివారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత విజయ్ మాట్లాడుతూ.. “నేను ఒక సాధారణ సినీ అసిస్టెంట్ డైరెక్టర్ కొడుకుగా పుట్టాను. పేదరికం, ఆకలి నాకు తెలుసు. నేనేమీ రాజవంశం నుంచి రాలేదు, నేనూ మీలో ఒకడినే“ అని భావోద్వేగంగా ప్రసంగించారు. విజయ్ తండ్రి ఎస్.ఏ. చంద్రశేఖర్ 1974 వరకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి, 1978లో దర్శకుడిగా మారారు. విజయ్ తన తండ్రి దర్శకత్వంలోనే బాలనటుడిగా, ఆ తర్వాత హీరోగా తెరంగేట్రం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయ్ తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ విజయం సాధించి, ఆయన ముఖ్యమంత్రి అయిన సంగతి తెలిసిందే



# పట్టణ పేద మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూత





**నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో మహిళలకు చికెన్ ఎగ్ కార్ట్స్ పంపిణీ**

**రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** పట్టణ పేద మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూత లో భాగంగా నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో మహిళలకు చికెన్ ఎగ్ కార్ట్స్ పంపిణీ చేయడం జరిగిందని రాష్ట్ర వాణిజ్య పరిశ్రమలు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ గుప్తా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో పట్టణ పేద మహిళల జీవనోపాధిని పెంపొందించి, వారిని ఆర్థిక సాధికారితను కలిగించాలనే లక్ష్యంతో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ వారి ఆర్థిక సహకారంతో, మెప్మా ఆధ్వర్యంలో కర్నూలు అర్బన్ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు 5 మందికి 5 చికెన్ ఎగ్ కార్ట్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ... మహిళల అభివృద్ధి లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్వయం సహాయక సంఘ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి తో అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు 5 మందికి 5 చికెన్ ఎగ్ కార్ట్స్ ను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని, ఒక్కో కార్ట్ విలువ రూ.50 వేల తో మొత్తం ఐదు కార్ట్స్ విలువ రూ.2 లక్షల 50 వేలుగా ఉందని వెల్లడించారు. మెప్మా ద్వారా మహిళలకు వివిధ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గుడ్ల ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయాన్ని పెంచుకుని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలనే ఉద్దేశంతో ఈ పైలెట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పొదుపు గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు చిన్న వ్యాపార అవకాశాలను కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు, కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.. ఈ కార్ట్స్ ద్వారా మహిళలు వ్యాపారం నిర్వహించి స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. శ్రీనివాసులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వేం అభినందన సభకు భారీ ఎత్తున తరలిరండి:మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి



**కేసముద్రం, మే 11(నంది పత్రిక):**రాజ్యసభ సభ్యుడుగా ఎన్నికై మొదటి సారిగా మహబూబాబాద్ ప్రాంతానికి విచ్చేయుచున్న సందర్భంగా నిర్వహించే వేం నరేందర్ రెడ్డి సన్మాన, అభినందన సభకు కేసముద్రం మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వేం అభిమానులు భారీ ఎత్తున తరలి రావాలని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్ లో మంగళవారం వేం నరేందర్ రెడ్డికి సన్మాన, అభినందన సభ ఎమ్మెల్యే డా.భూక్య మురళి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారనీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్ లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, ఆర్టీసీ అథారిటీ సభ్యులు రావుల మురళీ, నాయకులు నీలం దుర్గేశ్, చిలువేరు సమ్మయ్య గౌడ్, భానోత్ చిన్న వెంకన్న, వేముల శ్రీనివాస్ రెడ్డి, జాతీయ కాంగ్రెస్ నాయకులు పోకల శ్రీనివాస్, బనిశెట్టి వెంకటేశ్, భానోత్ బాలు నాయక్, మార్కెట్ డైరెక్టర్లు చిదురాల వసంత రావు, ఎండీ అయ్యూబ్ ఖాన్, కౌన్సిలర్లు తరాల వీరేష్ యాదవ్, ధారావత్ కిషోర్, బద్య నాయక్, అంగోత్ బాల, వల్లాందాసు రవి, భానోత్ బాలునాయక్, కనుకుల రాంబాబు, ఎండీ తాజుద్దీన్, శ్రీరామ్ కిరణ్, షేక్ ముజ్జు, ఎండీ నయీం, రషీద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఎ, బి, సి. క్యాంపు క్వార్టర్స్లో అనధికారికంగా నివసిస్తున్న వారిని

# ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టండి

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా**

**ఎ, బి, సి. క్యాంపు క్వార్టర్స్లో అనధికారికంగా నివాసముంటున్న వారు ఈ నెల 25 వ తేదీ లోపు ఖాళీ చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**కర్నూలు నగరంలోని ఎ, బి, సి. క్యాంపు క్వార్టర్స్లో అనధికారి కంగా నివాసముంటున్న వారిని ఖాళీ చేయించేం దుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ల తో కలిసి ఆర్ అండ్ బి, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో మంత్రి సమీక్షిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ బి సి క్యాంపుల్లో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటుకు వీలుగా అనధికారికంగా నివాసముంటున్న వారిని ఖాళీ చేయించేం దుకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.. ఎ, బి, సి. క్యాంపు క్వార్టర్స్లో అనధికారికంగా నివాసముంటున్న వారు ఈ నెల 25 వ తేదీ లోపు ఖాళీ చేయాలి. నగరంలోని ఎ, బి, సి. క్యాంపు క్వార్టర్స్లో అనధికారికంగా నివాసముంటున్న వారు ఈ నెల 25 వ తేదీ లోపు ఖాళీ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సమావేశంలో



జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ,ఆర్ అండ్ బి ఈఈ సునీల్ రెడ్డి, కర్నూలు అర్బన్ తహసిల్దార్ రవి, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, కర్నూలు రూరల్ తహసిల్దార్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించను

**స్మార్ట్ సిటీ లక్ష్యంగా సమిష్టిగా కృషి చేయాలి**

**రహదారుల గుంతల గుర్తింపుకు ఏఐ సాంకేతికత వినియోగించాలి**

**తాగునీటి సరఫరా, పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

**మున్సిపల్ అధికారుల సమీక్షలో మంత్రి టీ.జీ. భరత్ గుప్తా**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** నగరాభివృద్ధికి సంబంధించిన పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ గుప్తా స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి మున్సిపల్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గతంలో ఇచ్చిన ఆదేశాల అమలుపై ఆరా తీశారు, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. రహదారులపై ఉన్న గుంతలను గుర్తించి వెంటనే పూడ్చేందుకు ఏఐ సాంకేతికత సహాయం తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో రహదారుల విస్తరణపై స్టడీ నిర్వహించాలని తెలిపారు.సుంకేసుల జలాశయం నుండి మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పైప్లైన్ పనులను వేగవంతం చేయాలని, నెలలోపు పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని తీసుకుని సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.గార్గేయపురం డంప్యార్డులో బయో మైనింగ్ పనులు, ప్లాంట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చెత్త సేకరణకు అవసరమైన ఆటోలను త్వరలోనే తెప్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రజాధనం ఆదా చేసేలా సచివాలయాల తరలింపు, అలాగే అవసరమైన మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు పంప్ హౌస్, గణేష్ నగర్ ప్రాంతాల్లో భూమి కేటాయించాలని సూచించారు.పార్కుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలని, తొలి దశలో ఆరు పార్కులను అభివృద్ధి చేయాలని తెలిపారు. నగరంలో పూడికతీత పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు.ఆస్తి పన్ను మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. టిడ్కో గృహాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించి తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని ఆదేశించారు.సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, ఆర్వోలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఇంచార్జీ సిటి ప్లానర్ వై.వి. వెంకటరమణ, అకౌంట్స్ ఆఫీసర్ రఘునందన్, పబ్లిక్ హెల్త్ అధికారులు,పాల్గొన్నారు.

# శ్రీశైలం నీటిముంపు బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలం






**పిక్కిలి వెంకటేశ్వర్లు.**

**శ్రీశైలం ముంపు బాధితుల దీక్షకు సంఘీభావం తెలిపిన సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు.**

**నందికొట్కూరు మే 11( నంది పత్రిక)** శ్రీశైలం నీటి ముంపు నిర్వాసిత బాధితులకు న్యాయం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమైందని, గత ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం నాయకులు శ్రీశైలం నీటిముంపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఐ ఎమ్ ఎల్.లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో శ్రీశైలం నీటిముంపు బాధితులు చేపడుతున్న నిరాహార దీక్ష శిబిరాని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా పార్టీ కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షలు చేపడుతున్న ప్రభుత్వ స్పందన లేకపోవడంతో శ్రీశైలం నీటిముంపు బాధితులు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులతో కలిసి దీక్ష శిబిరం నుండి పటేల్ సెంటర్ వరకు ర్యాలీగా బయలుదేరి కేజీ రహదారిపై రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలం నీటి ముంపు బాధితుడు జయన్న మాట్లాడుతూ రాష్ట్రానికి వెలుగులు నింపి నేడు శ్రీశైలం నీటి ముంపు బాధితుల కుటుంబాలు సరియైన ఆదరణ ఉపాధి అవకాశాలు లేక సర్వం కోల్పోయి చీకటిలో మగ్గుతున్నామని, మా కోరికలను ఎన్నికల ప్రచారంలో నెరవేరుస్తామని ఓటు బ్యాంకు రాజకీయాలు చేసి పాలకులు నమ్మించి మోసం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల ప్రచారంలో కూటమినేతల టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ మరియు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ లు శ్రీశైలం నీటింపు బాధితులను అధికారంలోకి వస్తే ఉద్యోగాలు కల్పించి ఆదుకుంటామని హామీ ఇచ్చారని, కానీ నేడు విస్మరించడం సరికాదన్నారు. అనంతరం సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీశైలం నీటిముంపు నిర్వాసితుల త్యాగ ఫలితమే నేడు రాష్ట్రంలో రైతన్నలకు ప్రజలకు సాగు త్రాగునీరుకు, మరియు విద్యుత్ కు ఎలాంటి డోకా లేదని , అలాంటి త్యాగాలు చేసిన కుటుంబాలను ఆదుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆయన విమర్శించారు. జీవో నెంబర్ 98 అమలు చేయడంలో పాలకుల నిర్లక్ష్యం ముమ్మాటికి శ్రీశైలం నీటిమపు బాధితుల పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడమేనన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల నెరవేర్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు మాట్లాడుతూ సంవత్సరాలు గడుస్తున్న, వివిధ ప్రభుత్వ పాలకులు మారుతున్న శ్రీశైలం నీటిముంపు బాధితులను పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. వారి త్యాగం రాష్ట్ర ప్రజానీకం మరువలేనిదని, వారి త్యాగంతో నేడు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వెలుగులలో జీవిస్తున్నారని, 8 లక్షల , హెక్టార్ల భూమికి సాగునీరు అందడంతో వ్యవసాయ రంగంలో రైతు కుటుంబాలు రాణిస్తున్నాయని, ఇలాంటి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన శ్రీశైలం నీతిముంపు బాధితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నీటిమొంపు బాధితులు మరియు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యకర్తలు నాయకులు నాగేంద్రుడు, రాజారావు, మౌలాలి, సాలమ్మ, రాణి, శ్యామలమ్మ, యశోదమ్మ, పటాన్ సాహెబ్ ఖాన్, నారాయణ, రవి అయ్యా, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు నరసింహులు , వేల్పుల ఏసన్న, మేకల చంద్రశేఖర్, లింగాల శ్రీనివాసులు, ఎం నరేష్, శ్రీరాములు, ప్రగతిశీల సంఘం జిల్లా మహిళా నాయకురాలు ఎస్ బిబి, లక్ష్మీదేవి, మూర్తి జాబి, నవ్య సాని, నూర్జహాన్, శిరీష, మణి కుమారి, షాహిన మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్రాగునీటి కి అవస్థలు పనిచేయని ఆర్వో ప్లాంట్



**కోవెలకుంట్లమే 11 నందిపత్రిక** కోవెలకుంట్ల పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్ నందు సాంఘిక సంక్షేమ వసతి గృహం దగ్గర మినరల్ వాటర్ ప్లాంట్ గత కొన్ని రోజులుగా పనిచేయడం లేదు..దింతో మంచి నీళ్ల కోసం ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు ఈ పరిస్థితుల్లో మంచి నీళ్ల కోసం మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లవలిసి వస్తున్నది ఇక్కడ వాటర్ ప్లాంట్ లో మిసినరీ కూడా చెడిపోయింది వాటర్ పూరిఫై కాకుండా వస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించి మినరల్ వాటర్ ప్లాంట్ రిపేర్ చేయాలని వారు కోరుతున్నారు.



## వెంకటాపురంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**శిరివెల్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గత రెండు రోజులుగా ఆధ్యాత్మిక వైభవంగా జరుగుతున్న హనుమాన్ జయంతి వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం విశేష అభిషేక పూజలతోపాటు పంచకుండాత్మక హనుమాత్ కవచహవనం పూజలు, యజ్ఞాలను నిర్వహించారు. వెంకటాపురంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో పెద్దపెద్ద భారీ సేమియానాలతో అలంకరించారు.ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. హాజరైన భక్తులకు పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం హనుమాన్ జయంతి రోజున విశేష పూజా కార్యక్రమాలు గ్రామోత్సవం మరియు భక్తులకు అన్నదాన కార్యక్రమం చెక్కభజన కళాకారుల మధ్యప్రదర్శనలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు అర్చకులు అన్నారు.



# జలధార - జలహారతి పనులు వేగవంతం చేయాలి

**పెండింగ్ ప్రతిపాదనలు వెంటనే అప్‌లోడ్ చేయాలని అధికారులకు ఆదేశం**

**ఉపాధి హామీ లక్ష్య సాధనపై ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**

**స్వర్ణగ్రామం - స్వర్ణవార్డు సర్వే పనులు వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, మే 11(నంది పత్రిక):-** జిల్లాలో అమలవుతున్న జలధార - జలహారతి పనులను వేగవంతం చేసి, మంజూరైన అన్ని పనులను తక్షణమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధార - జలహారతి, స్వర్ణగ్రామం - స్వర్ణవార్డు సర్వేల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 2,862 పనులను గుర్తించగా, వాటిలో 2,124 పనులకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే 1,622 పనులు గ్రౌండింగ్ అయి అమలులో ఉన్నాయని, ఇంకా ప్రారంభం కాని 493 పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇకపై కొత్త ప్రతిపాదనల కంటే మంజూరైన పనుల అమలు, పూర్తి ప్రక్రియపైనే దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. చాగలమర్రి, వెలుగోడు, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, ఆళ్లగడ్డ, రుద్రవరం, గడివేముల, పగిడ్యాల, పాములపాడు, బేతంచెర్ల, ఆత్మకూరు మండలాల్లో గుర్తించిన అన్ని పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. ప్యాపిలి, డోన్, పాణ్యం మండలాల్లో అధిక సంఖ్యలో పనులు ఇంకా కలెక్టర్ లాగిన్‌కు అప్‌లోడ్ చేయాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే చెరువులు, గ్రామ ప్రణాళికలు సిద్ధమైనప్పటికీ నీటి సంరక్షణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. స్వర్ణగ్రామం - స్వర్ణవార్డు కార్యక్రమంలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఈ-కేవైసీ, వాట్సాప్ గవర్నెన్స్, సిబ్బంది హాజరు అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో రోజువారీ లక్ష్యం 1.05 లక్షల శ్రామికులు కాగా ప్రస్తుతం 60 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారని, మిగిలిన లక్ష్య సాధనపై ఎంపీడీఓలు దృష్టి సారించాలని సూచించారు. కొలిమిగుండ్ల, బనగానపల్లి, పాములపాడు, అవుకు మండలాల్లో పనితీరు తక్కువగా ఉందని, వెంటనే పురోగతి మెరుగుపర్చాలని కలెక్టర్ ఆదేశించారు.

# రెండు రోజుల పాటు విద్యా శిబిరం




**మంత్రాలయం, మే11,** : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు ఆదేశానుసారం రెండు రోజుల పాటు విద్యా శిబిరం నిర్వహించామని మంత్రాలయం దాస సాహిత్య ప్రధాన సారధి విద్వాన్ సులాది హనుమేశాచార్ తెలిపారు. సోమవారం మంత్రాలయ శ్రీ గురుసర్వ్వామ దశసాహిత్య ప్రాజెక్ట్, 2026 సంవత్సరపు నూతన భజన మండలుల కొరకు మంత్రాలయం ప్రాంగణంలో ఒక విద్యా శిబిర కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. మంత్రాలయ దశసాహిత్య ప్రధాన సారధి అయిన విద్వాన్ సులాది హనుమేశాచార్ నాయకత్వంలో,రెండు రోజుల పాటు జరిగే ఈ విద్యా శిబిరంలో సుప్రభాత ధ్యానం,హరిదాసర పద ధ్యానం,హరిదాసర పద సాధన, భగవద్రూప ధ్యానం, శ్రీమధ్వమత పంచభేదాల ధ్యానం, మొదలైన వాటిపై అభ్యాసం ఉంటుందని తెలిపారు. భజనమండలుల సభ్యులు వివిధ నగరాల నుండి వచ్చారన్నారు.

# టిడిపి కార్యాలయా నిర్మాణం పై ఉన్న శ్రద్ధ.. అలగనూరు రిజర్వాయర్ మరమ్మత్తులపై ఎందుకు లేదు..?

**ఎన్ రంగ నాయుడు. సిపిఐ జిల్లా కార్యదర్శి.**

**నందికొట్కూరు మే 11( నంది పత్రిక )** రైతుల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు రైతన్నల సంక్షేమ కోసం సాగుతాగు నీరు అలగనూరు రిజర్వార్ మరమ్మత్తులపై ఎలాంటి స్పందన లేకపోవడం విడ్డూరంగా ఉందని, జిల్లా కేంద్రంలో టిడిపి కార్యాల నిర్మాణం పై ఉన్న శ్రద్ధ జిల్లా రైతన్నలపై ఎందుకు లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం సిపిఐ పార్టీ కార్యాలయం నందు జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ బాబు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు రఘు రామ్మూర్తి తో కలసి అలగనూరు రిజర్వాయర్ మరమ్మత్తుల నిర్మాణ కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని అందుకు నిదర్శనమే అలగనూరు రిజర్వాయర్ మరమత్తుల పనులు పూర్తి కాకపోవడమేనన్నారు. అలగనూరు రిజర్వాయర్ నిర్మాణానికి పది సంవత్సరాలు అవుతున్న రైతు సమస్యలను పక్కనపెట్టి జిల్లా కూటమి ప్రజా ప్రతినిధులు తమ పార్టీ కార్యాలయం నిర్మాణం పై శ్రద్ధ చూపించడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వానికి అలగనూరు రిజర్వాయర్ రైతుల బాధ పట్టదా అంటూ ఆయన ప్రశ్నించారు. ఏళ్లు గడుస్తున్న కనీసం ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయకపోవడం ప్రభుత్వానికి రైతన్నల పట్ల ఎంతటి చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అలగనూరు రిజర్వాయర్ పరిధిలోని ప్రజాప్రతినిధులు కనీసం అలగనూరు రిజర్వాయర్ రైతన్నల కోసం ఆలోచించే పరిస్థితుల్లో లేకపోవడం శోచనీయమన్నారు. నందికొట్కూరు పాణ్యం నియోజవర్గాల ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ రైతుల పక్షాన ఎమ్మెల్యే ల గృహాలను రైతులతో కలిసి ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.




# భూపనపాడుకు భరోసాగా నిలిచిన జిల్లా కలెక్టర్

**30 ఏళ్ల సమస్యలకు ఆరు నెలల్లో శాశ్వత పరిష్కారం**

**"భూపనపాడు ఆడపడుచు"గా కలెక్టర్**

**రాజకుమారికి గ్రామస్థుల ఘన సన్మానం**

**నంద్యాల బ్యూరో, మే 11(నంది పత్రిక):-** ప్రజా సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిష్కారం చూపితే గ్రామాల రూపురేఖలు ఎలా మారుతాయో భూపనపాడు గ్రామం నేటి పరిస్థితి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో పాణ్యం మండలం భూపనపాడు గ్రామ ప్రజలు తమ గ్రామ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించినందుకు కృతజ్ఞతగా జిల్లా కలెక్టర్ రాజకుమారిని ఘనంగా సన్మానించారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత కలిసి గజమాలలు, పసుపు-కుంకుమలతో ఆమెకు సత్కారం నిర్వహించారు. ప్రేమాభిమానాల సూచకంగా కలెక్టర్‌ను "భూపనపాడు ఆడపడుచు"గా అభివర్ణించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, దశాబ్దాలుగా మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూపనపాడు బీసీ కాలనీకి జిల్లా కలెక్టర్ చొరవతో కొత్త జీవం లభించిందన్నారు. గత 30 ఏళ్లుగా కాలనీలో సరైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడేవారమని తెలిపారు. ప్రతి వర్షాకాలంలో మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొనేదని వివరించారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి స్వయంగా గ్రామాన్ని సందర్శించి, వర్షంలోనే కాలనీ వీధులన్నీ తిరిగి పరిస్థితిని పరిశీలించారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించిన ఆమె వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి సీసీ రోడ్లు, సమగ్ర డ్రైనేజీ నిర్మాణ పనులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఆమె ప్రత్యేక చొరవతో కేవలం ఆరు నెలల్లోనే పనులు పూర్తై గ్రామం పూర్తిగా మారిపోయిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షం కురిసినా నీరు నిల్వ లేకుండా డ్రైనేజీ ద్వారా సాఫీగా వెళ్లిపోతోందని, ఆధునిక సదుపాయాలతో కూడిన రహదారులు అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఈ విజయం ఒక్కరి కృషి ఫలితం కాదని, ఇంజనీరింగ్ శాఖతో పాటు అన్ని విభాగాల అధికారుల సమిష్టి కృషివల్లే సాధ్యమైందన్నారు. గ్రామ ప్రజలు వ్యక్తిగత ప్రయోజనాల కంటే గ్రామ అభివృద్ధి, ఉమ్మడి సమస్యల పరిష్కారానికి ఏకమై కృషి చేయడం తనను ఎంతో ఆకట్టుకుందని చెప్పారు. తక్కువ సమయంలో నాణ్యతతో పనులు పూర్తి చేసిన అధికారులను ఆమె అభినందించారు.

తమపై చూపిన ప్రేమాభిమానాలకు భూపనపాడు గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ అభివృద్ధిని క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి సేవలను గ్రామస్థులు కొనియాడారు. ఇలాంటి అధికారులు జిల్లాకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.



# ప్రతి ఫిర్యాదుకు సరైన ఎండార్స్మెంట్ ఇవ్వాలి

**పీజీఆర్ఎస్ ద్వారా 286 దరఖాస్తుల స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, మే 11(నంది పత్రిక):-** ప్రజలు సమర్పించే ప్రతి ఫిర్యాదును పూర్తిస్థాయిలో పరిశీలించి, వాటికి సరైన ఎండార్స్మెంట్ ఇచ్చి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారులు సమర్పించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యకు అనుగుణంగా స్పష్టమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. అలా చేయడం ద్వారా దరఖాస్తులు తిరిగి రీఓపెన్ కాకుండా ఉండటంతో పాటు, అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం స్థాయిలో కూడా రీఓపెన్ అయిన దరఖాస్తులను స్వయంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం లేదా సరైన ఎండార్స్మెంట్ ఇవ్వకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 5,306 దరఖాస్తులు రీఓపెన్ కాగా, వాటిలో 5,064 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న 242 దరఖాస్తులపై సంబంధిత అర్జీదారులతో నేరుగా మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలో 171 దరఖాస్తులు రీఓపెన్ కాగా, అందులో 166 దరఖాస్తులు పరిష్కరించామని, మిగిలిన 5 దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలో రీఓపెన్ అయిన అన్ని దరఖాస్తులను పూర్తిగా పరిష్కరించినట్లు వెల్లడించారు.



**పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పాలసాగరం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ గత ఆరు నెలలుగా పనిచేయడం లేదని గ్రామస్తుడు ఫిర్యాదు చేయగా, తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

2) నంద్యాల పట్టణంలోని దేవనగర్‌కు చెందిన బి. నాగమణి తన భర్త అనారోగ్యంతో మరణించడంతో వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

3) నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఎస్. గోవిందస్వామి కాలనీలో ఉన్న భారీ వృక్షాల కొమ్మలు వర్షాల కారణంగా హై వోల్టేజ్ విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉందని, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

# శాంతియుత, ప్రశాంత వాతావరణంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించాలి..!




**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**భద్రతా నిబంధనలు, షరతులకు లోబడి ఉత్సవ నిర్వహణకు అనుమతి**

**ర్యాలీలో అన్నదానాలు, డీజేలు, బాణాసంచాల నిషేధం**

**కడప, బ్యూరో చీఫ్ మే 11 నంది పత్రిక** హనుమాన్ జయంతి ఉత్సవ కార్యక్రమాలను శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పోలీసు, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన.. ఈ నెల 12న హనుమాన్ జయంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల శాంతి భద్రతలపై.. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధి మీనా, కడప నగర కమిషనర్ హెచ్.ఎస్. భావన లతో కలిసి.. పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా మత సామరస్యానికి ప్రతీకగా ప్రతి ఏడాది సంప్రదాయంగా.. హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోందన్నారు. తాజాగా కడప నగరంలోని అల్మాస్ పేటలో చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో.. నగరంలో, జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి ఉత్సవ వేడుకలను కొన్ని షరతులకు లోబడి.. శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను కల్పించడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించి ఉత్సవ కమిటీ సభ్యులకు సంబందిత ఏర్పాట్లపై క్షుణ్ణంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆయా శాఖల అధికారులు సంబంధిత ఏర్పాట్లను నిర్ణీత సమయం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని ఉత్సవ ర్యాలీ నిర్వహించే అన్ని ప్రాంతాల్లో, సెన్సిటీవ్ ఏరియాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే.. ఆయా ప్రాంతాల్లో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి.. ఉత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను కడప నగరపాలక సంస్థ ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవ ర్యాలీలో బాణసంచాలు, డీజేలు, అన్నదానం వంటి కార్యక్రమాలు నిషేదించడమైనదన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. భక్తుల మనోభావాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. కొన్ని భద్రతా ప్రమాణాల షరతులకు మేరకు ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు.. జిల్లా పోలీసు యంత్రాంగం తరుపున అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ఎక్కడా, ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా.. ఈ ఏడాది కూడా హనుమాన్ జయంతి ఉత్సవాలను, ర్యాలీని విజయవంతం చేసేందుకు పోలీసు యంత్రాంగం నుండి సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, కేఎంసి అదనపు కమీషనర్ రాకేష్ చంద్రం, డీఎస్పీలు అన్ని విభాగాల పోలీసు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com